PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 304 | విజయవాడ, శనివారం 8 జూన్ 2024 | 10 పేజీలు + 8 వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 8 June 2024 | Rs



శ్రీవారి ఆలయం ఎదుట
ముఖేష్ కుమార్ మీనా కుటుంబసభ్యులు

ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతం

- శ్రీవారిని దర్శించుకున్న సిఇఒ ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం బయట ముఖేష్ కుమార్ మీనా మీడియాతో మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించామన్నారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.

సినీ నటుడు శివాజీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఎపికి స్వర్ణయుగం మొదలైందని, కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వడదెబ్బకు ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వడదెబ్బకు ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దిబ్బవానిపేటకు చెందిన టి.ఎర్రయ్య (59) గ్రామంలోని దుమ్ము వారి అమ్మోరు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులకు వెళ్లారు. ఉదయం పది గంటలకు పని పూర్తి చేసుకుని తోటి కార్మికులు ఇంటికి చేరుకోగా, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎర్రయ్య చెరువు గట్టుపైనే ఉండిపోయారు. మధ్యాహ్నం కార్మికులంతా పని చేసేందుకు తిరిగి చెరువు వద్దకు చేరుకోగా గట్టుపై ఎర్రయ్య విగతజీవిగా పడి ఉన్నారు. నీళ్ల చల్లినా చలనం లేకపోవడంతో మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు, ఉపాధి హామీ అధికారులకు సమాచారం అందించారు.



లిక్కర్ కేసులో కవిత పాత్రపై సిబిఐ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్

- జ్యుడీషియల్ కస్టడీ 21 వరకు పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్రపై సిబిఐ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో శుక్రవారం దాఖలు చేసింది. దాదాపు రెండు వేలకు పైగా పేజీలతో కవిత రోల్‌ను సిబిఐ పేర్కొన్నట్లు తెలిసింది. ఈ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై జులై 6న విచారణ చేపడతామని కోర్టు వెల్లడించింది. సిబిఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి పొడిగించింది. గతంలో విధించిన కస్టడీ ముగియడంతో శుక్రవారం కవితను జైలు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కవిత కస్టడీని పొడిగించాలని సిబిఐ తరపున న్యాయవాదులు కోర్టును కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, కవిత జ్యుడీషియల్ కస్టడీని జూన్ 21 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సంజయ్, కొల్లి బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఐడి చీఫ్ సంజయ్‌ను, చంద్రబాబు అరెస్టు సమయంలో సిట్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన కొల్లి రఘురామిరెడ్డిని ప్రభుత్వం శుక్రవారం బదిలీ చేసింది. సంజయ్‌ను డిజిపి కార్యాలయంలో, రఘురామిరెడ్డిని జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. వారిద్దరి బాధ్యతలను డిజిపికి అప్పగించింది.


12వ తేది ఉదయం11.27 గం॥లకు

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- గన్నవరం ఐటిపార్కు వద్ద వేదిక
- మోడీతో పాటు పలువురు సిఎంలు రాక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారానికి వేదిక, సమయం ఖరారైంది. 12వ తేదీ ఉదయం 11.27 నిముషాలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు సమీపంలోని కేసరపల్లి ఐటిపార్కు వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. దీనికోసం అక్కడ భారీ వేదికను ఏర్పాటు చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అనువైన స్థలం కోసం అమరావతి చుట్టుపక్కల పలు ప్రాంతాలను పరిశీలించినప్పటికీ వర్షం, భద్రతా కారణాల రీత్యా వాటిని వద్దనుకున్నారు. చివరిగా గన్నవరం సమీపంలోని ఐటిపార్కులో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని హోదాలో నరేంద్ర మోడీ, పది రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు హాజరువుతున్నారు. ఈ మేరకు టిడిపి కార్యాలయానికి సమాచారం అందింది. ప్రమాణ స్వీకారానికి స్థలం ఖరారు కావడంతో అధికారయంత్రాంగం ఏర్పాట్లపై దృష్టి



సారించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ జిఎడి అధికారులతో ఈ విషయమై చర్చించారు. ఎవరెవరికి ప్రభుత్వం తరుపున ఆహ్వానాలు పంపించాలి అనే అంశంపై నిర్ణయానికి వచ్చారు. వివిఐపిలు ఎయిర్‌పోర్టు నుండి నేరుగా ప్రమాణ స్వీకార వేదిక వద్దకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పలుచోట్ల పరిశీలన

అంతకుముందు అమరావతిలోని రాయపూడి, ఉద్దండ రాయునిపాలెం, ఎయిమ్స్ దగ్గర్లోని బ్రహ్మానందపురాన్ని అచ్చెన్నాయుడు తదితరులు పరిశీలించారు. అమరావతిలో ఎక్కడ చూసినా ముళ్ల కంప పెరిగి ఉండటంతో వాటిని తొలగించి నేలను చదును చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని భావించారు. ప్రధాని మోడీ వస్తే భద్రతాపరమైన అంశాలు వస్తాయని అధికారులూ తెలిపారు. మందడంలో తొలిసారి చంద్రబాబు అమరావతికి శంకుస్థాపన చేసిన స్థలాన్ని కూడా పరిశీలించారు. వెలగపూడి సచివాలయం పక్కనే చేయాలనుకున్నా అక్కడ గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో ఆ స్థలాన్ని వద్దనుకున్నారు.

సూపర్ సిక్స్‌పై సంతకాలు

ప్రమాణ స్వీకారం పూర్తయిన వెంటనే మ్యానిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్ అంశాలపై సంతకాలు చేయనున్నట్లు తెలిసింది. మెగా డిఎస్‌సి, పెన్షన్లు, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ల హామీలపై తొలి సంతకాలు చేయనున్నట్లు తెలిసింది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుకు సంబంధించి కేంద్రం నుండి నాయకులు వస్తున్న నేపథ్యంలో అక్కడే చేయాలా, లేక అసెంబ్లీలో తీర్మానం చేసి అనంతరం చేయాలా అనే అంశంపై నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

తెరపైకి మరో సారి 'సిట్'

- విశాఖ భూ కుంభకోణాలు నివేదికలు బహిర్గతమయ్యేనా?
- సిఎస్ జవహర్‌రెడ్డిపై అసైన్డ్ ఆరోపణలు నిగ్గుతేలేనా?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి బినామీల పేరుతో ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున అసైన్డ్ భూములు కొనుగోలు చేశారని విశాఖపట్టణానికి చెందిన జనసేన కార్పొరేటర్ పివిఎల్‌ఎన్ మూర్తి తాజాగా చేసిన ఆరోపణలతో రాజకీయ వర్గాల్లో ప్రకంపనాలు సృష్టించాయి. వీరితో పాటు బ్యూరోక్రాట్స్ కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సిఎస్‌తో పాటు వైసిపిలోని ఓ కీలకనేత కూడా అసైన్డ్ భూముల వ్యవహారంలో ఉన్నాడనే వార్త రాష్ట్రవ్యాప్తంగా దుమారం లేపింది. ఈ విషయంపై వాస్తవాలను నిగ్గు తేల్చాలనే పట్టుదలతో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఈ నెల 12న ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం వారం పది రోజుల్లో భూకుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. సీనియర్ ఐఎఎస్ అధికారి నేతృత్వంలో దర్యాప్తు చేయించాలా? లేక సిట్టింగ్ హైకోర్టు జడ్జి ద్వారా చేయిస్తే బాగుంటుందా? అనే అంశం ఈ వారంలో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఉత్తరాంధ్రలో మిలిటరీ ఉద్యోగులకు ఇచ్చిన అసైన్డ్‌భూములు, పేదలకిచ్చిన అసైన్డ్ భూములను ధర్మాన రెవెన్యూమంత్రిగా పనిచేసే కాలంలో తమకు అనుకూలంగా మార్చుకున్నారనే ఆరోపణలతో రాష్ట్రం విడిపోయిన తర్వాత టిడిపి ప్రభుత్వం సిట్‌ను నియమించింది. 2019లో వైసిపి అధికారంలోకి రాగానే విశాఖ భూముల కుంభకోణంలో టిడిపి నేతల పాత్ర ఉందంటూ మరోసారి సిట్‌ను నియమించారు. నేటికీ ఆ నివేదిక వెలుగులోకి రాలేదు. దసపల్లా హిల్స్‌కు చెందిన భూములను వైసిపి పెద్దలు ఆక్రమించారంటూ 2023లో జనసేన, బిజెపి ఆరోపించింది. విశాఖ భూముల కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చేందుకు సిబిఐతో విచారణ చేయించాలని గతంలో మాజీమంత్రి బండారు సత్యనారాయణ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈసారైనా సిట్ నివేదికలు బహిర్గతమై, చర్యలు తీసుకునే పరిస్థితి ఉంటుందా? అనే విషయంపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



నీట్ యుజి ఫలితాల్లో నారాయణ విజయ పరంపర

ప్రజాశక్తి - హైదరాబాద్

వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ (యుజి)-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు విజయ పరంపరను మోగించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు పి సింధూర నారాయణ, శరణి నారాయణ తెలిపారు. 720కి 720 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో ఎనిమిది ఫస్ట్ ర్యాంక్‌లు సాధించి తమ ఆధిపత్యాన్ని కొనసాగించామన్నారు. ఓపెన్ కేటగిరీలో సామ్ శ్రేయస్ జోసెఫ్, సందీప్ చౌదరీ, షాహ్, పి ఆదిత్య కుమార్, శశాంక్ శర్మ, ఈషా కొఠారి, ప్రాచిత, దర్ష్ పగ్‌దార్ ఆలిండియా ఒక్కటవ ర్యాంక్‌లను సాధించారని వెల్లడించారు. మొత్తం ఎనిమిది మంది నారాయణ విద్యార్థులు ఫస్ట్ ర్యాంక్‌లు సాధించి ఆల్‌టైం రికార్డ్‌ను సాధించారన్నారు. అదే విధంగా 715 ఆపైన మార్కులు సాధించిన వారిలో 26 మంది తమ విద్యార్థులు ఉన్నారన్నారు. 710 మార్కుల పైనా సాధించిన వారిలో 45 మంది, 700 మార్కుల ఎగువన 105 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. సిబిఎస్ఇ సిలబస్ ఆధారంగా చేసుకుని నిర్వహించబడుతున్న నీట్ పరీక్ష కోసం అత్యంత వినూత్న విద్యా ప్రణాళిక వలనే ఈ టాప్ ర్యాంకులు సాధించగలిగామన్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

ఐఎఎస్, ఐపిఎస్‌లలో అభద్రత


ఎటువంటి విచారణలు ఎదుర్కోవాలనే టెన్షన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో అధికార మార్పిడి జరగడంతో ఐఎఎస్, ఐపిఎస్‌లలో అభద్రత నెలకొంది. గత ఐదేళ్ల వైసిపి పాలనలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన బ్యూరోక్రాట్లలో ఏ రోజు ఎటువంటి విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళన నెలకొంది. అధికారుల గృహాల తనిఖీ, మరోవైపు ఐటి విభాగంలో సర్వర్లు, ఐడిలు లాక్‌చేసి పోలీసులను కాపలా ఉంచుతుండటంతో అధికారుల్లో ఆందోళన తీవ్రమైంది. టిడిపి అధినేత చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేయనుండగా, తమను రిలీవ్ చేయాలని కోరే ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల సంఖ్య పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నతాధికారులు అనేక ఫైళ్లు నడిపారనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సిఎస్ జవహర్‌రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ రావత్‌కు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డికి మాత్రమే సెలవులు మంజూరు చేసిన ప్రభుత్వం మిగిలిన అధికారులకు సెలవులు మంజూరు చేయొద్దని ఆదేశించింది. ఇప్పటికే సిట్‌తోపాటు ఇతర బాధ్యతల నుంచి ఐజి ర్యాంకు అధికారి కొల్లి రఘురామిరెడ్డిని ఉన్నతాధికారులు తప్పించారు. స్కిల్ కేసులో హెరిటేజ్ పత్రాలను సిట్ అధికారులు తగలబెట్టారని టిడిపి అప్పట్లోనే గవర్నరుకు ఫిర్యాదు చేసింది. ఇసుక, మద్యం, మైనింగ్ రంగాల్లో భారీ అవినీతి జరిగిందని నూతన ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏ అధికారి ఇంట్లో తనిఖీలు ఉంటాయో, ఏ అధికారిపై ఎటువంటి వేటు పడుతుందో అర్థంగాక బ్యూరోక్రాట్లు తలపట్టుకుంటున్నారు. ముఖ్యంగా అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేందుకు సహకరించారనే ఆరోపణలతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రామకృష్ణపైనా నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా ఓ చిట్‌ఫండ్ సంస్థకు సంబంధించిన వ్యవహారంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విచారణకు ఆదేశించనున్నట్లు తెలిసింది. ఉత్తరాంధ్రలో అసైన్డ్ భూముల కుంభకోణంలో జవహర్‌రెడ్డి, ఆయన కుమారునిపై విశాఖ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ విమర్శలు చేశారు. అత్యంత కీలకంగా బేవరేజస్, సిట్, సిఐడి కార్యాలయాల్లో ఫైళ్లను మారుస్తున్నారనే విమర్శలొచ్చిన నేపథ్యంలో ఆయా విభాగాల అధికారులపైనా తీవ్ర చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. ఐపిఎస్‌లలో సీతారామాంజనేయులు, సంజయ్, కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువా, అమ్మిరెడ్డి, అన్బురాజన్ వంటి వారిపైనా విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

'ఇండియా'లో అన్ని కులాలకూ ప్రాతినిధ్యం

- ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు సముచిత స్థానం
- ఎన్‌డిఎలో కానరాని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కు ఎంపిలు
- అగ్ర కులాలకే అధిక ప్రాధాన్యత



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరంలో కులాలు ప్రధాన పాత్ర పోషించాయి. అటు ఎన్‌డిఎ, ఇండియా ఫోరం సామాజిక న్యాయాన్ని పరస్పర విరుద్ధమైన దృష్టితో చూశాయి. ఒకే మతం నీడన హిందూ కులాలను ఏకం చేసేందుకు బిజెపి ప్రయత్నించింది. మరోవైపు సామాజిక న్యాయ సాధనకు కులం కీలకమైన సాధనమని ఇండియా వేదిక భావించింది. మొత్తంమీద ఎన్‌డిఎలో పోలిస్తే ఇండియా బ్లాక్ లోనే వివిధ కులాలు, వర్గాలకు సముచిత ప్రాధాన్యత లభించినట్టు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో 2019, 2024 ఎన్నికల్లో దిగువసభలో వివిధ కులాలు, వర్గాలకు లభించిన ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే...

ఏ కులం వారు ఎందరు?

17వ లోక్‌సభ సభ్యుల్లో 28.5 శాతం మంది అగ్రకులాల వారు ఉండగా 18వ సభకు 25.8 శాతం మంది మాత్రమే ఎన్నికయ్యారు. కర్నాటకకు చెందిన ఒక్కళిగులు, తమిళనాడులోని వెల్లలాలు, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని జాట్లు, బీహార్‌లోని కుర్మీలు, కొయిరీలు, మధ్యప్రదేశ్‌లోని లోధాలు, ఆంధ్రప్రదేశ్‌లోని కమ్మ, రెడ్లు...ఇలా కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైన కులాల వారు గత సభలో 14.4 శాతం మంది ఉంటే రాబోయే సభలో 13.6 శాతం మంది ఉంటారు. ఒబిసిల సంఖ్య 22.8 శాతం నుంచి 25.4 శాతానికి పెరిగింది. ఎస్‌సిల సంఖ్య 15.5 శాతం నుంచి 15.8 శాతానికి స్వల్పంగా పెరగ్గా ఎస్‌టిల సంఖ్య 10.1 శాతం వద్ద స్థిరంగా ఉంది. ముస్లింల సంఖ్య 5.0 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గింది. క్రైస్తవుల సంఖ్య అప్పుడు, ఇప్పుడూ 1.3 శాతంగానే ఉంది. సిక్కుల సంఖ్య 2.0 శాతం నుంచి 2.4 శాతానికి పెరిగింది.

గత లోక్‌సభలో బౌద్ధులు 0.2 శాతం మంది ఉంటే ఇప్పుడు ఒక్కరు కూడా లేరు. గుర్తించని కులాల వారు గత సభలో 0.2 శాతం మంది ఉంటే 18వ లోక్‌సభలో వారి సంఖ్య 1.1 శాతానికి పెరుగుతుంది.

హిందీ రాష్ట్రాల్లో...

హిందీ రాష్ట్రాల్లో కులాలు, వర్గాల ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే...అగ్ర కులాల వారి సంఖ్య 38.9 శాతం నుంచి 32.7 శాతానికి తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాలకే పరిమితమైన కులాలకు చెందిన వారి సంఖ్య 6.2 శాతం నుంచి 6.6 శాతానికి పెరిగింది. ఓబీసీ సభ్యుల సంఖ్య కూడా 25.7 శాతం నుంచి 31.0 శాతానికి పెరిగింది. ఎస్సీల సంఖ్య 17.3 శాతం నుంచి 17.7 శాతానికి, ఎస్టీల సంఖ్య 8.0 శాతం నుంచి 8.4 శాతానికి పెరిగింది. హిందీ రాష్ట్రాల నుంచి ముస్లింల ప్రాతినిధ్యం మాత్రం 3.5 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గిపోయింది.

కూటముల వారీగా...

కులాలు, వర్గాల వారీగా ఎన్‌డిఎ, ఇండియా ఫోరం తరపున లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల వివరాలను పరిశీలిస్తే...ఎన్‌డిఎ ఎంపీల్లో అగ్రకులాల వారు 33.2 శాతం, ఇండియా బ్లాక్‌కి చెందిన వారు 12.4 శాతం మంది ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే కన్పించే కులాలకు సంబంధించిన సభ్యులు ఎన్డీఏ పక్షాన 15.7 శాతం మంది ఎన్నికైతే ఇండియా బ్లాక్ నుంచి 11.9 శాతం మంది గెలుపొందారు. ఎన్డీఏ ఎంపీల్లో ఓబీసీలు 26.2 శాతం మంది ఉంటే ఇండియా బ్లాక్ ఎంపీలు 30.7 శాతం మంది ఉన్నారు. ఎన్డీఏ ఎంపీల్లో ఎస్సీలు 13.3 శాతం, ఎస్టీలు 10.8 శాతం మంది ఉండగా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కుల కు ప్రాతినిధ్యం లేదు. అదే ఇండియా బ్లాక్‌లో ఎస్సీలు 17.8 శాతం, ఎస్టీలు 9.9 శాతం, ముస్లింలు 7.9 శాతం, క్రైస్తవులు 3.5 శాతం, సిక్కులు 5 శాతం ఉన్నారు.

సంయమనం పాటించండి

- టిడిపి కార్యకర్తలకు చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల అనంతరం అక్కడక్కడ చోటుచేసుకుంటున్న కవ్వింపు చర్యలు, దాడులపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. కొన్నిచోట్ల వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ఘర్షణల విషయంపై పార్టీ నేతల ద్వారా సమాచారం తెప్పించుకున్నారు. వైసిపి కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు చంద్రబాబు సూచించారు. నాయకులు సైతం అప్రమత్తంగా ఉండి ఎటువంటి దాడులు, ప్రతి దాడులు జరగకుండా చూడాలని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలను ఆదేశించారు. ఈ విషయంలో పార్టీ కేడర్ పూర్తి సంయమనంతో ఉండాలని పిలుపునిచ్చారు. వైసిపి కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా పూర్తి సంయమనం పాటించాలన్నారు. పోలీస్ అధికారులు సైతం శాంతిభద్రతలు అదుపులో ఉండేలా చొరవ చూపాలన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంపైనే దృష్టి : సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వైసిపి పాలనలో సర్వనాశనమైపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంపైనే తమ దృష్టంతా ఉందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక వైఎస్ జగన్ మాటల తీరు చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందని అన్నారు. రాష్ట్రం నాశనమైపోతుందని, టిడిపి దాడులు చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పేందుకు గవర్నరు వద్దకు తాము వెళ్లాల్సిన సమయంలో వైసిపి నేతలను పంపడం జగన్ రివర్స్ విధానంలో భాగమేనని విమర్శించారు.

ఓటమిని జీర్ణించుకోలేని జగన్ ఆత్మవిమర్శ చేసుకోకుండా, ప్రజలపై నిందలు వేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ఘోర ఓటమికి జగనే కారణమని విమర్శించారు. మాచర్లలో రావణకాండను అప్పుడే మరచిపోయారా? అని ప్రశ్నించారు. జగన్‌పై ఉన్న 11 కేసుల్లో వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

'ఉక్కు' రక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ


ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1212వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సిఆర్ఎంపి, హైడ్రాలిక్, లూబ్రికేట్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపడానికి ప్రయత్నించాలన్నారు. ఎన్నికల ఫలితాలను గుర్తించి ఇప్పటికైనా మిగిలిన పార్టీలు స్టీల్‌ప్లాంట్ కోసం పోరాడాలని కోరారు.రాష్ట్రంలో గెలుపొందిన నాయకులు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్ రక్షణకు పాటుపడాలని కోరారు.

రామోజీరావుకి తీవ్ర అస్వస్థత

- ఐసియులో చికిత్స

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు ఐసియులో వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అనారోగ్య కారణంగా రామోజీరావు గత కొంతకాలంగా ఇంటికే పరిమితమయ్యారు. ఇంట్లోనే ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రామోజీరావు ఆరోగ్య పరిస్థితిపై వైద్య వర్గాలు రాత్రి 10.30 గంటల వరకు ఎటువంటి ప్రకటనా విడుదల చేయలేదు.

27 వరకు సెలవు మంజూరు

- జవహర్‌రెడ్డి లీవ్‌పై సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని ఈ నెల 27వ తేదీ తరువాత సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. అత్యవసర కారణాల రీత్యా తనకు ఆర్జిత సెలవులు ఇవ్వాలని జవహర్‌రెడ్డి గురువారం నాడు సాధారణ పరిపాలనశాఖను కోరారు. దీన్ని పరిశీలించిన సిఎస్ 27 వరకూ సెలవు మంజూరు చేశారు.

రాజీనామాలు తెప్పించుకోవాలని అన్ని శాఖలకు సిఎస్ ఆదేశం

రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, ఇతర సంస్థలకు సంబంధించిన నామినేటెడ్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల రాజీనామాలను వెంటనే తెప్పించుకోవాలంటూ సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్ని శాఖల సెక్రటరీలను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యేలు అనిత, రామకృష్ణబాబు

లోకేష్‌ను కలిసిన పలువురు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వెలగపూడి రామకృష్ణబాబు, ఎంఎస్ రాజు, వంగలపూడి అనిత, కొండయ్య యాదవ్, బిజెపి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు కలిశారు. వీరితోపాటు సినీనటులు నిఖిల్, బండ్ల గణేష్, పార్టీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, నాగుల్ మీరా, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చింతకాయల విజయ్, భూమా విఖ్యాత్ రెడ్డి, తిప్పేస్వామి, దామచర్ల సత్య తదితరులు ఉన్నారు. అదే విధంగా సుమారు రెండు వేల మంది పార్టీ కార్యకర్తలను కలిసిన లోకేష్ వారితో ఫొటోలు దిగారు.

కేంద్రమంత్రి పదవులు ఎన్ని?

- మోడీతో చర్చించిన బాబు
- నేడు స్పష్టత వచ్చే అవకాశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర మంత్రివర్గంలో టిడిపి ఎన్ని పదవులు దక్కనున్నాయన్న అంశం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రానికి కేబినెట్‌లో ప్రాతినిధ్యం ఖాయమైనప్పటికీ ఎన్ని పదవులు కేటాయిస్తారు? ఎవరికీ ఇస్తారు? అనే అంశం తేలాల్సి ఉంది. రాష్ట్రం నుంచి ఆరేళ్ల తరువాత కేంద్రమంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కనుంది. శుక్రవారం ఉదయం మోడీ, అమిత్‌షా, నడ్డాతో చంద్రబాబునాయుడు సమావేశమైనారు. అనంతరం ఎంపిలతో సమావేశం నిర్వహించారు. కేంద్రమంత్రి పదవులు, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై జరిపిన చర్చల సారాంశాన్ని వారికి వివరించారు. టిడిపికి మూడు నుంచి నాలుగు కేంద్ర మంత్రి పదవులు దక్కే అవకాశం ఉందని టిడిపి నేతలు అంటున్నారు. తొలుత రెండు, ఆ తరువాత మరో రెండు ఇచ్చే అవకాశం ఉండొచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే, తొలి వరుసలో శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేరు దాదాపు ఖరారయింది. రామ్మోహన్ వరుసగా మూడు సార్లు గెలవడం, తొలి నుంచి రామ్మోహన్ నాయుడు కుటుంబం టిడిపిలో ఉండటం కలిసొచ్చే అంశం. రెండో మంత్రి పదవి గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావు పేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్లు పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. వీరిలో ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన అమలాపురం నుంచి గెలిచిన గంటి హరీష్ మాధుర్, చిత్తూరు నుంచి గెలిచిన దగ్గుమళ్ల ప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి. అదేవిధంగా రెడ్డి సామాజిక వర్గం నుంచి నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి పేర్లు పరిశీలించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మొత్తంమీద శనివారం సాయంత్రానికి ఈ విషయమై స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 43 సంచిక : 304 | విజయవాడ, శనివారం 8 జూన్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 8 June 2024 | Rs

కృష్ణా డెల్టా సాగుకు నీరేది?

- గోదావరిలో 14 అడుగులకూ చేరని ప్రవాహం
- ఖాళీ అయిన 'పులిచింతల'
- ఆందోళనలో రైతులు

6



ఐఎస్ఎస్‌లో సునీతా విలియమ్స్ చిందులు

- ఆనందోత్సాహాలతో మురిసిన వ్యోమగాములు

5

సిఎస్‌గా నీరబ్‌కుమార్

- సిఎంఒ నుండి ముగ్గురు సీనియర్ ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా సీనియర్ ఐఎఎస్ అధికారి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు 1987 బ్యాచ్‌కు చెందిన ఆయన్ను సిఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తరువాత కాసేపటికే రాష్ట్ర సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను పలువురు సీనియర్ ఐఎఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు సిఎస్‌గా ఉన్న జవహర్‌రెడ్డి గురువారంసెలవుపై వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నీరబ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన రాష్ట్ర గవర్నర్ మహ్మద్ అబ్దుల్ నజీర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు. గవర్నర్‌ను కలిసి వచ్చిన కాసేపటికే ముఖ్యమంత్రి కార్యాలయంలో ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐఎఎస్ అధికారులు పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తాలను అక్కడి నుండి బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. వీరిని సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. వీరి స్థానంలో త్వరలోనే కొత్త అధికారులను నియమించనున్నారు. వాస్తవానికి గతంలోనే నీరబ్‌ను సిఎస్‌గా నియమించి ఉండాల్సింది. అయితే, వైసిపి ప్రభుత్వం ఆయనకన్నా జూనియర్ అయిన 1990 బ్యాచ్‌కు చెందిన జవహర్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది. వైసిపి ప్రభుత్వ కాలమంతా కూడా నీరబ్ ప్రాధాన్యత లేని శాఖల్లోనే కొనసాగారు. తాజా ఎన్నికల్లో టిడిపి గెలిచిన తరువాత చంద్రబాబును కలిసిన వారిలో ఆయన కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఆ భేటీలోనే సిఎస్ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం.

నిబంధనలు దాటొద్దు : అధికారులకు ఆదేశం

సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, శాఖాపరమైన విచారణ నిర్వహిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న శాఖల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆ శాఖల్లో అనుమతులు లేకుండా కొత్తగా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టవద్దన్నారు. ఆర్థికపరమైన అంశాల వ్యవహారంలో ఎవరూ ఎటువంటి లావాదేవీలూ జరపొద్దని, సిఎఫ్ఎంఎస్‌కు సంబంధించిన విషయాల్లో పూర్తి అనుమతులు ఉన్న తరువాతే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. డిపార్టుమెంట్లలోనూ అంతర్గత బదిలీలు చేయొద్దని పేర్కొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న సిఎస్ నీరబ్‌కుమార్

ఆ అధికారుల'పై ఆరా

వైసిపి ప్రభుత్వ హయాంలో సిఎం నివాసానికి పక్కనే నిర్మించిన భవనాల్లో నివాసం ఉన్న ఐఎఎస్, ఐపిఎస్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. వీరి వివరాలను సిఎస్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. 18 మంది సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు సిఎం నివాసానికి అనుకుని, చుట్టుపక్కల ఉన్న బంగళాల్లో ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు. దాదాపు 15 మంది కమిషనర్ స్థాయి అధికారులు కూడా నిరంతరం అక్కడే ఉండేవారని గుర్తించినట్లు తెలిసింది. ప్రభుత్వ అధికారులుగా విధి నిర్వహణలో వీరు ఎలా వ్యవహరించారన్న విషయాన్ని పరిశీలిస్తున్నారు.

ఎన్‌డిఏ నేతగా మోడీ

బలపరిచిన చంద్రబాబు, నితీష్

ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన రాష్ట్రపతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నికైన నరేంద్ర మోడీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఆహ్వానించారు. దీంతో మోడీ మూడవ సారిగా ప్రధాన మంత్రి పదవి చేపట్టబోతున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అంతకు ముందు ఎన్డీయే ఎంపీలు పార్లమెంటు సెంట్రల్ హాలులో సమావేశమై తమ పార్లమెంటరీ పార్టీ నేతగా మోడీని ఎన్నుకున్నారు. అటు పిమ్మట మోడీ, ఆయనకు మద్దతు తెలుపుతున్న ఇతర ఎన్డీయే భాగస్వామ్య పార్టీల నేతలను వెంటతీసుకుని రాష్ట్రపతి వద్దకు వెళ్లి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని కోరారు. మోడీని ప్రధానిగా నియమిస్తూ రాష్ట్రపతి వారికి ఓ లేఖ అందజేశారు.

అనంతరం మోడీ రాష్ట్రపతి భవన్ ఆవరణలో మీడియా పాయింట్ వద్దకు వచ్చి, ప్రధానిగా తనను నియమిస్తూ రాష్ట్రపతి ఇచ్చిన నియామక పత్రాన్ని విలేకరులకు చూపారు.ప్రమాణ స్వీకార ముహూర్తం గురించి రాష్ట్రపతి అడిగారని, ఆదివారం సాయంత్రం 6 గంటలకు అయితే బాగుంటుందని తెలియజేశానని అన్నార,. ప్రమాణ స్వీకారానికి ముందుగా కేంద్ర మంత్రుల జాబితాను రూపొందించి రాష్ట్రపతికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 2047లో దేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోనున్నందున ఈ పద్దెనిమిదో లోక్‌సభ ఆ కలలను సాకారం చేయడంలో ముఖ్యమైన మైలురాయిగా ఉంటుందని అన్నారు. కొత్త లోక్‌సభ నూతన శక్తి, యువ శక్తితో కూడుకున్నదని చెప్పారు. రాష్ట్రపతిని కలిసిన ఎన్డీయే బృందంలో జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎన్.చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్, రాజీవ్ రంజన్ సింగ్ ఏకనాథ్ షిండే, హెచ్.డి. కుమారస్వామి, చిరాగ్ పాశ్వాన్, పవన్ కళ్యాణ్, తదితరులు ఉన్నారు.



నరేంద్ర మోడీని ప్రధానిగా నియమిస్తూ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

మోడీపై పొగడ్తలు

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పొగడ్తల జల్లు కురిసింది. మోడీ ఎన్డీయే భాగస్వాములను పొగడగా, మిత్రులు మోడీని ఏకంగా ఆకాశానికెత్తేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అధ్యక్షతన జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో లోక్‌సభాపక్ష నేతగా నరేంద్ర మోడీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, చంద్రబాబు నాయుడు, నితిన్ గడ్కరీ, నితీష్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, పవన్ కళ్యాణ్ తదితరులు బలపరిచారు. ఎన్డిఎ కూటమి నేతగా ఎన్నికైన సందర్భంగా మోడీ మాట్లాడుతూ ఎన్డీయే విజయం వెనుక లక్షలాది మంది **మిగతా 5లో**

బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎమ్‌డి నివాసంలో సిఐడి సోదాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వాసుదేవరెడ్డి

ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎమ్‌డి వాసుదేవరెడ్డి నివాసంలో సిఐడి సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని నానక్‌రామ్ గూడాలోని ఆయన నివాసానికి శుక్రవారం ఉదయాన్నే సిఐడి అధికారులు చేరుకున్నారు. వివిధ పత్రాలను తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో మద్యం విధానం, లావాదేవీలకు సంబంధించి విలువైన పత్రాలు, ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మద్యం విధానం పేరుతో ధరలు పెంచడం, డిజిటల్ లావాదేవీలకు అనుమతి ఇవ్వకపోవడం వంటి అనేక ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేసినా కనీసం పరిగణనలోకి తీసుకోలేదని, నాయకులను కలిసేందుకూ అంగీకరించేవారు కారని చెబుతున్నారు. అలాగే విజయసాయిరెడ్డి అల్లుడికి చెందిన డిస్టిలరీస్ నుండి పెద్దఎత్తున కొత్త బ్రాండ్లను తీసుకురావడం, వాటి లావాదేవీలు కేవలం నగదు రూపంలో జరిగేలా చూడటంలోనూ వాసుదేవరెడ్డి ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఒంగోలు ఎంపిగా ఉన్న మాగుంట శ్రీనివాసులు రెడ్డికి చెందిన డిస్టిలరీస్ నుండి మద్యం కొనుగోళ్లను దాదాపు నిలిపేశారు. అప్పట్లోనే వైసిపి ఎంపిలు, ఎమ్మెల్యేల నుండి పెద్దఎత్తున విమర్శలు వచ్చినా అప్పటి సిఎం జగన్, విజయిసాయిరెడ్డి, పెద్దిరెడ్డి మద్దతుతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలూ ఉన్నాయి. మద్యం విషయంలో సుమారు రూ.25 వేల కోట్ల వరకూ వైసిపి నాయకులకు ఆయన లబ్ధి కలిగించారని అంటున్నారు. ఆయనపై ఇప్పటికే సిఐడి అధికారులు కేసు నమోదు చేశారు.

పటిష్ట వరి విధానంతోనే ఆహార భద్రత

- ప్రపంచ సదస్సులో వక్తలు
- హైదరాబాద్‌లో ప్రారంభం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఆహారభద్రత కోసం పటిష్టమైన వరి విధానాన్ని రూపొందించాల్సిఉందని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. రెండు రోజులపాటు జరిగే ప్రపంచ వరి సదస్సు 2024 హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైంది. అంతర్జాతీయ నిత్యావసరాల సంస్థ (ఐసిఐ) ప్రతి సంవత్సరం ఒక్కొక్క దేశంలో ప్రపంచ వరి సదస్సును గత 22 సంవత్సరాల నుండి నిర్వహిస్తోంది. భారతదేశంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 30 దేశాల నుంచి 150 మంది ఎగుమతిదారులు, దిగుమతిదారులు, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఫిలిప్పీన్స్) శాస్త్రవేత్తలు, దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, రైస్ మిల్లర్లు, వరి విత్తన కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు అనుసరిస్తున్న వరి విధానాలు - ఆహారభద్రతపై విస్తృతంగా చర్చ జరిగింది. హైబ్రిడ్ రకపు ధాన్యాలపై జరుగుతున్న పరిశోధనలు, ప్రపంచ మార్కెట్ ధోరణుల పైనా తొలిరోజు చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల వరివంగడాలు సాగవుతున్నప్పటికీ, చాలా తక్కువ వాటికే డిమాండ్ ఉంటోందని, ఫలితంగా కొరత ఏర్పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న తెలంగాణ రాష్ట్రంలోనే 220 రకాల వరి సాగవుతుందని, అయితే డిమాండ్ మాత్రం ఒకటి, రెంటికి మాత్రమే ఉంటోందని ఆ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సదస్సు దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి హాజరైన శాస్త్రవేత్తలు కూడా ఈ తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తక్కువ కార్బోహైడ్రేట్‌లు ఉండే ధాన్యాన్ని రూపొందించడం, అన్ని రకాలను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ఆహారకొరతను అధిగమించడంతో పాటు ప్రజా ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని పలువురు సూచించాచు.



సదస్సులో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

సంక్షోభమే సవాలు : తుమ్మల

వ్యవసాయ సంక్షోభం అనేది నేటికీ పెద్ద సవాలుగానే మిగిలిపోయిందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సదస్సును ప్రారంభించిన ఆయన మనదేశంలో వరి ఉత్పత్తి స్వాతంత్ర్యం అనంతరం దాదాపు ఎనిమిది రెట్లు పెరిగి 14 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరుకుందని వివరించారు. మన దేశం నుండి వివిధ రకాల వరి సుమారు వంద దేశాలకు ఎగుమతి అవుతోందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం వరి దిగుమతుల కోసం మనదేశం వైపు చూస్తున్నాయని, ఈ అవకాశాన్ని మనం పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే మన రైతాంగానికి సరైన ధర లభిస్తుందని, మార్కెట్, నిల్వల సమస్య కూడా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. వరి సాగు వృద్ధి, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయాలపై పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వాణిజ్యవేత్తలు మాట్లాడారు. ఈ సదస్సులో అంతర్జాతీయ నిత్యావసరాల సంస్థ అధ్యక్షులు జెరిమీజివింగర్, ప్రపంచ బియ్యం ఎగుమతిదారుల సమాఖ్య, సంఘాల అధ్యక్షులు ప్రేమ్‌గార్గ్, బివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్న విజయం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు బలపర్చిన తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. బుధవారం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు శుక్రవారం రాత్రి 11 గంటల వరకు జరిగింది. తొలి ప్రాధాన్యతా ఓట్లలో ఎవరికీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించి ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. తీన్మార్ మల్లన్నకు, బిఆర్ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 48 మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. బిజెపి బలపర్చిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, తర్వాత రాకేశ్‌రెడ్డి కూడా ఎలిమినేషన్ కావడంతో తీన్మార్ మల్లన్నను విజేతగా ఎన్నికల అధికారులు ప్రకటించారు.

పైనాపురంలో అతిసార

- మహిళ మృతి
- కరోనరీ మరణం అంటున్న అధికారులు

ప్రజాశక్తి- నెల్లూరు

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పైనాపురంలో పలువురు అతిసార బారినపడ్డారు. గడిచిన మూడు రోజులుగా గ్రామంలోని దళితవాడ, గిరిజన ప్రాంతాల్లో సుమారు 20 మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. నగరంలోని పలు ఆస్పత్రుల్లో వారు చికిత్స పొందుతున్నారు. కావలి రమణమ్మ (53) అనే మహిళా అతిసార వ్యాధితో జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ముత్తుకూరు మండల పరిధిలోని పలు ప్రయివేట్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, రసాయనాల వల్ల తాగు నీరు కలుషితం కావడంతో అతిసార వ్యాధి ప్రబలిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కరోనరీ డెత్ : ఇన్‌ఛార్జి డిఎం అండ్ హెచ్‌ఒ ఖాదర్ వలి

రమణమ్మ అతిసారతో మృతి చెందలేదని, కరోనరీ మృతి అని జిజిహెచ్ వైద్యాధికారులు నిర్ధారించినట్లు ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టరు ఖాదర్‌వలి తెలిపారు. గుండెకు సంబంధించిన సమస్యతో ఆమె గురువారం జిజిహెచ్‌లో చేరారన్నారు. వైద్య చికిత్స నిమిత్తం చేరిన ఇద్దరి మహిళల పేర్లు ఒక్కటే కావడంతో ఆస్పత్రి సిబ్బంది పొరపాటుబడి అతిసారతో బాధపడుతున్న రమణమ్మ మరణించినట్లు తొలుత ప్రకటించారని పేర్కొన్నారు. నిజానికి ఆమె మృతి చెందలేదని, చికిత్స పొందుతున్నారని తెలిపారు.

బాధితులకు సిపిఎం పరామర్శ

డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ముత్తుకూరు మండలం సిపిఎం శాఖ నాయకులు గోగుల శ్రీనివాసులు పరామర్శించారు. బాధితుల ఆరోగ్యం పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 20 మంది అతిసారతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అతిసారతో రమణమ్మ మృతి చెందడం బాధకరమని పేర్కొన్నారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాల వల్ల ఇటువంటి పరిస్థితులు ఏర్పడడం బాధాకరమన్నారు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజావైద్యశాల సీనియర్ డాక్టర్ శ్రీనునాయక్, జెవివి నాయకుల బృందం శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించింది. రమణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి కారణాలు తెలుసుకుంది.

రష్యాలో నలుగురు భారత వైద్య విద్యార్థుల మృతి

- స్నేహితురాలిని కాపాడేయత్నంలో నదిలో మునక

మాస్కో : రష్యాలో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లి అనుకోని ప్రమాదంలో చిక్కుకొని భారత్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు నదిలో మునిగి చనిపోయారు. కేంద్ర విదేశాంగ శాఖ, మాస్కోలోని భారత దౌత్య కార్యాలయం శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం..మహారాష్ట్రలోని జలగావ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న నోవ్‌గార్డ్ స్టేట్ యూనివర్సిటీలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఇద్దరు అమ్మాయిలు, మరో ముగ్గురు అబ్బాయిలు. 18-20 ఏళ్ల మధ్య వయస్సున్న ఈ ఐదుగురు వర్సిటీకి సమీపంలోనే ఉన్న వోల్కోవ్ నదీ తీరానికి సరదాగా గడిపేందుకు వెళ్లారు. మిత్రులంతా ఆనందోత్సవాల్లో మునిగితేలుతున్నారు. ఇంతలోనే వారిలో ఒక అమ్మాయి నదీ తీరం నుంచి జలాల్లోకి వెళ్లగా ఆమె కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన మిగిలిన నలుగురు విద్యార్థులు నదిలో కొట్టుకుపోతున్న స్నేహితురాలిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో మిగిలిన నలుగురు కూడా ఆమెతో పాటు నీట మునిగారు. విషయాన్ని గమనించిన స్థానికులు కూడా వారిని రక్షించేందుకు శక్తిమేరా ప్రయత్నించారు. ఒక అబ్బాయిని మాత్రం క్షేమంగా ఒడ్డుకు చేర్చగలిగారు. మిగిలిన నలుగురు అప్పటికే నీట మునిగిపోవడంతో ఊపిరాడక ప్రాణాలొదిలారు. ఈ విషాద ఘటనపై సమాచారం అందుకున్న భారత దౌత్య కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. విద్యార్థుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. విద్యార్థుల మృతదేహాలను సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి పంపించేందుకు రష్యా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని భారత రాయబార కార్యాలయ అధికారులు తెలిపారు. క్షేమంగా ఒడ్డుకు చేరిన అబ్బాయిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన వోల్ఖోవ్ నది

వడ్డీ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ : అధిక వడ్డీ రేట్ల నుంచి ఉపశమనం కోరుకుంటున్న రుణ గ్రహీతలకు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోసారి నిరాశనే మిగిల్చింది. వరుసగా ఎనిమిదోసారి కూడా వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. గతంలో 2023 ఫిబ్రవరిలో చివరిసారి రెపో రేటును మార్చింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరింగ్ పాలసీ కమిటీ (ఎంపిసి) భేటీ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడుతూ.. రెపో రేటు 6.5 శాతంగానే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రెపో రేటును యథాతథంగా ఉంచేందుకు ఆరుగురు ఎంపిసి సభ్యుల్లో నలుగురు అనుకూలంగా ఓటు వేశారన్నారు. ఆర్‌బిఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య వరుసగా వడ్డీ రేట్లను పెంచింది. ఆరుసార్లలో 2.50 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో వడ్డీ, వాయిదా చెల్లింపులు ఎక్కువై రుణాలు భారం అయ్యాయి. ఈ క్రమంలోనే అనేకమంది గృహ, వాహన, వ్యక్తిగత రుణ గ్రహీతలు ఇకనైనా వడ్డీ రేట్లలో తగ్గుదల ఉండొచ్చని ఆశించినా, ప్రతిసారీ భంగపాటే ఎదురవుతోంది.

తీరం... ప్రమాదకరం

- కోతకు గురవుతున్న కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు
- సముద్రంలో కలుస్తున్న మత్స్యకారుల గృహాలు
- తీర ప్రాంత రక్షణకు నూతన ప్రభుత్వంపై ఆశలు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఇటీవల తుపాను ప్రభావంతో పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ-కాకినాడ మధ్య సముద్ర తీర ప్రాంతం మరోసారి అతలాకుతలమైంది. బీచ్ రోడ్డు కోతకు గురైంది. తీర ప్రాంతంలోని ఆరుగురు మత్స్యకారుల గృహాలు దెబ్బతిన్నాయి. తుపానులు, అల్పపీడనాలు ఏర్పడినప్పుడల్లా కెరటాల తాకిడితో తీర ప్రాంతం కోతకు గురవుతూనే ఉంది. దీంతో, మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. 17 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 'జియో ట్యూబ్' టెక్నాలజీతో తీరప్రాంత రక్షణకు ఏర్పాటు చేసిన బండరాళ్లు ఐదేళ్ల క్రితం పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీరప్రాంత రక్షణకు శాశ్వత పరిష్కారం చూపుతామంటూ ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పదే పదే చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడనుండడంతో పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ తీర ప్రాంత రక్షణకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



తుపాను సమయంలో అలల తాకిడికి కోతకు గురైన నివాస గృహాలు (ఫైల్ ఫొటో)

ఐదేళ్ల క్రితం ధ్వంసమైన 'జియో ట్యూబ్' టెక్నాలజీ

2004 డిసెంబర్‌లో వచ్చిన సునామీ కారణంగా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమై పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. 2005 మార్చిలో కోటి రూపాయల నిధులతో ఉప్పాడ శివారు కొత్తపట్నం నుంచి బర్మా కాలనీ వరకూ 200 మీటర్ల పొడవున ఆర్ అండ్ బి అధికారులు పెద్ద పెద్ద బండరాళ్లను వేశారు. అయినా సముద్రపు కోతను నివారించలేకపోయారు. ఈ నేపథ్యంలోనే అప్పటి కేంద్రం మంత్రి ఎంఎం.పళ్లంరాజు సహకారంతో ఇరిగేషన్ శాఖ అధికారులు రూ.14 కోట్లు ఖర్చు చేసి 1.53 కిలోమీటర్ల పొడవున 2007లో జియోట్యూబ్‌ను ఏర్పాటు చేసి కోతను నివారించగలిగారు. గతంలో ఖైముక్, నీలం వంటి తుపానులను నుంచి తీరప్రాంతాన్ని ఇది రక్షించిందని మత్స్యకారులు చెబుతున్నారు. అధికారుల **మిగతా 5లో**

సంపాదకీయం

మరో 'స్టాక్' కుంభకోణం!

లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ వెలువడిన అనంతరం స్టాక్ మార్కెట్ పైకెగసి, వాస్తవ ఫలితాలొచ్చాక అమాంతం పడిపోవడంతో భారతీయ మదుపరులు దాదాపు 31 లక్షల కోట్ల రూపాయలు కోల్పోవడం మరో భారీ స్టాక్ కుంభకోణం. ఇదేదో ఆర్థిక కారణాలతో ఏవో సంస్థలు దివాలా తీయడం లేక స్టాక్ బ్రోకర్ల ఊదరగొట్టే ప్రచారం వల్లనో జరిగిందిగాక సాక్షాత్తూ దేశ ప్రధాని, హోం మంత్రి చేసిన సూచనల మేరకే స్టాక్స్‌లో మదుపు చేసినందువల్ల ఇందులో కేంద్ర ప్రభుత్వ పెద్దల పాత్ర ప్రత్యక్షంగా ఉందన్నది నిర్వివాదాంశం. కాబట్టి ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు జరిపించాలన్న పలువురి డిమాండ్ సమర్ధనీయమే! దేశంలో ఇంతకుముందు కూడా కొన్ని స్టాక్ కుంభకోణాలు జరిగాయి కానీ దేశ అత్యున్నత పదవులనలంకరించిన పెద్దల ప్రత్యక్ష ప్రోత్సాహంతో జరిగినవి లేవు. అనేక విషయాల్లో ప్రత్యేకతను చాటుకున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ తమ విశ్వసనీయత కోల్పోవడం కూడా ఒక ముఖ్యమైన అంశం. కుట్ర పూరితంగానే ఎగ్జిట్ పోల్స్ ఇచ్చారన్న విమర్శ అన్ని సంస్థల విషయంలోనూ కరెక్టు కాకపోయినా వాటిని పదేపదే హోరెత్తించిన కార్పొరేట్ మీడియా దుష్ట బుద్ధిని మాత్రం అందరూ అర్థం చేసుకోవడం అవసరం. గుజరాత్ అభివృద్ధి నమూనా అనీ నరేంద్ర మోడీ గొప్ప పరిపాలనాదక్షుడనీ వగైరా ఆకాశానికెత్తిన ప్రచారాలను వారు 2014 ఎన్నికల ముందునుంచీ చేస్తున్నదే! దీనినిబట్టి ప్రజలను వారు ఎంతలా తప్పుదారి పట్టిస్తున్నదీ అవగతం చేసుకోవచ్చు.

ఎన్నికల సందర్భంగా ప్రధాని, కేంద్ర హోం మంత్రి, ఆర్థిక మంత్రి స్టాక్ మార్కెట్‌పై వ్యాఖ్యలు చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. స్టాక్ మార్కెట్ అత్యంత వేగంగా పెరుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. హోం మంత్రి మాట్లాడుతూ జూన్ 4న స్టాక్ మార్కెట్ ఎగిసిపడుతుందని, ఈలోగా మీరందరూ అందులో ఇన్వెస్ట్ చేయాలనీ కోరారు. ఆర్థిక మంత్రి కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అసలు ప్రధాని, కేంద్ర మంత్రులు మదుపర్లకు ఎందుకు ఇలా పెట్టుబడులు పెట్టాలని సూచనలు చేశారన్నది పెద్ద ప్రశ్న. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని సూచించడం వారి పనా? స్టాక్ వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడినందుకు సెబీ దర్యాప్తును ఎదుర్కొంటున్న బిజినెస్ గ్రూప్‌నకు చెందిన ఒకే మీడియా సంస్థకు వారిద్దరూ ఎందుకు ఇంటర్వ్యూలు ఇచ్చారన్నది మరో ప్రశ్న. బిజెపికి, బూటకపు ఎగ్జిట్ పోల్స్ నిర్వాహకులకు, అలాగే ఎగ్జిట్ పోల్స్‌కు ఒక రోజు ముందు పెట్టుబడులు పెట్టి, ఐదు కోట్ల మంది భారత రిటైల్ ఇన్వెస్టర్లను పణంగా పెట్టి పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జించిన విదేశీ ఇన్వెస్టర్లకు మధ్య గల సంబంధం ఏమిటన్నదీ తేలాలి. కేవలం ఆర్థిక అంశమే అయితే సెబి దర్యాప్తులో వాస్తవాలు తెలియవచ్చు. కాని రాజకీయ నేతల పాత్ర, దేశ విదేశీ ప్రభుత్వ నియంత్రిత వ్యవస్థల ప్రమేయం కలిగిన ఇటువంటి అంశంపై జెపిసి మాత్రమే అన్ని కోణాల్లో దర్యాప్తు చేయడం సాధ్యమవుతుంది.

పదేళ్ల క్రితం అధికారానికి వచ్చాక తమ పాలనలో కార్పొరేట్లకు అందునా క్రోనీలకే లబ్ధి చేకూర్చిన మోడీ మూడోసారి అధికారం చేపట్టకముందే దేశ విదేశీ ద్రవ్య బేహారులకు దేశంలోని సాధారణ మదుపరుల సొమ్మును హారతిగా ఇచ్చారు. అయితే, ఇంతకు ముందరి రెండుసార్లు మాదిరిగా కాకుండా ఇప్పుడు బిజెపి సొంత మెజార్టీ కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఎగ్జిట్ పోల్- స్టాక్ మార్కెట్ కుంభకోణం పట్ల ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు గొంతెత్తాలి. తద్వారా సామాన్య మదుపరుల బాధ, ఆవేదనలకు ప్రతిస్పందించిన వారవవుతారు. అంతేగాక ఒక ప్రెజర్ గ్రూపుగా కూడా ప్రజలు వారిని గుర్తిస్తారు. ఇది కేవలం ఒక రాజకీయ అంశం లేక పాలనాపరమైనది మాత్రమేగాక ప్రజల కష్టార్జితం కొల్లగొట్టిన ఉదంతం. అందుకనే రాజకీయ పార్టీలు ముఖ్యంగా తెలుగు దేశం, జనతాదళ్ తదితర ఎన్‌డిఎ మద్దతు పార్టీలు ప్రతిస్పందించాలి. ఇదేదో మదుపరుల సమస్యగా మాత్రమేగాక జనం సొమ్ము కార్పొరేట్లు కొల్లగొట్టిన వ్యవహారం కనుక సమాజహితం కోరే శక్తులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అందుకు ప్రజలందరి మద్దతు అవసరం.

మంచి మాట



ప్రశ్నించడం మానేస్తే
బానిసత్వానికి
అలవాటు పడినట్లే.
బి.ఆర్.అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

ఎన్నికల తీర్పు ఒక ముందడుగు.. అయినా పోరు కొనసాగాల్సిందే

వ్యాఖ్య



2024 సార్వత్రిక ఎన్నికల తీర్పు ప్రత్యేకంగా చెప్పుకోదగింది. తాము ప్రజాస్వామ్యానికీ రాజ్యాంగానికీ ఎంత విలువ ఇస్తామో ఈ తీర్పు ద్వారా ప్రజలు చాటి చెప్పారు. 2014లోనూ 2019లోనూ పరిపూర్ణ ఆధిక్యత తెచ్చుకున్న బిజెపికి ఈ సారి ప్రజలు ఆ అవకాశం నిరాకరించారు. 303 స్థానాలున్న బిజెపి సీట్ల సంఖ్య ఈసారి 240కి పడిపోయింది. అంటే 21 శాతం తగ్గింది. ఎన్.డి.ఏ కు 292, 'ఇండియా' వేదికకు 234 స్థానాలు వచ్చాయి.

మోడీ పదేళ్ల పాలన నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ పాలన మొత్తం లక్షణం నియంతృత్వ పోకడలతో హిందూత్వ మతతత్వ ఎజెండాను అమలు జరిగింది. రాజ్యాంగ వ్యవస్థలో ప్రతి అంగమూ దిగ్బంధానికి గురైంది. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట పెట్టుకోవడానికి దారితీసింది. ఎన్నికల సన్నాహక దశలోనే ఇది ప్రతిబింబించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా పెట్టుకుని దాడి చేశాయి. ఇద్దరు ముఖ్యమంత్రులు జైళ్ల పాలైనారు. కాంగ్రెస్, సిపిఐ(ఎం) వంటి రాజకీయ పక్షాలపై కక్ష సాధింపు సాగింది. ఎన్నికల ప్రచారంలో కూడా ప్రతిపక్షానికి సమాన అవకాశం లేకుండా పోయింది. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ శోచనీయమైన పాత్ర పోషించింది. వెన్నెముక లేని కమిషనర్లతో నియమించబడిన ఎన్నికల కమిషన్ ఎన్నికల నియమావళి ఘోర ఉల్లంఘనలను శిక్షించడంలో గట్టిగా నిలబడలేక విఫలమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాలలో ముస్లింలపై విషం కక్కుతున్నా హద్దు ఆపూ లేకపోయింది. పోలింగ్ శాతానికి సంబంధించిన లెక్కలను క్రోడీకరించడంలో పారదర్శకత చూపించలేక అనవసర సందేహాలకూ తావిచ్చింది. ఈ కీలక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతకు విఘాతమేర్పడింది. కార్పొరేట్ మీడియావరణాన్ని పూర్తిగా బిజెపి గుత్తాధిపత్యంలోకి తెచ్చేసుకుంది. సోషల్ మీడియాలోనూ భారీ వనరులు గుమ్మరించింది. ప్రచారంలోనూ ఓటర్లకు పంచిపెట్టడం కోసమూ వేల కోట్లు వెచ్చించింది.

సమస్యలు ముందుకు..

ఈ మొత్తం ప్రచారంలో మోడీ, ఆయన హంగుదార్లు 'ఇండియా' వేదిక లోని పార్టీల పట్ల బెదిరింపులూ మోసగింపు ఎత్తుగడలకు పాల్పడ్డారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలోనే 'ఇండియా' వేదిక పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహించవలసి వచ్చింది. మోడీ పచ్చి మతోన్మాద పల్లవికి వ్యతిరేకంగా ప్రతిపక్షం నిరుద్యోగం, ఉద్యోగాలు, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి అంశాలను ముందుకు తెచ్చింది. హిందూత్వ శక్తుల నుంచి ప్రజాస్వామ్యానికి రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదాలపై దృష్టి సారించేలా చేసింది. మొట్టమొదటి సారిగా రాజ్యాంగ రక్షణ అంశం విశాల ప్రజారాశులను మరీ ముఖ్యంగా దళితులను ఆకట్టుకుంది. బిజెపి మెజార్టీ కోల్పోవడంలో ఉత్తర ప్రదేశ్‌లో దానికి తగిలిన ఎదురుదెబ్బ కీలకమైంది. అక్కడున్న 80 స్థానాలలోనూ గతంలో 62 వస్తే ప్రస్తుతం 33 మాత్రమే పొందగలిగింది. హిందూత్వ రాజకీయాలకు ఉత్తర ప్రదేశ్ గుండెకాయ లాంటిది. అయోధ్యలో రామమందిరం హిందూ దురభిమాన ఎజెండాకు ప్రతీకలాటిది. ఇవన్నీ వున్నా బిజెపి ఓట్లు 9 శాతం తగ్గిపోయాయి. నిరుద్యోగ సమస్య మూకుమ్మడి ప్రభావం, ధరల పెరుగుదల, రైతుల అసంతృప్తి, అగ్నివీర్ పథకంపై యువత అసంతృప్తి, పరీక్షా పత్రాల లీకేజి వంటి అంశాలే మతతత్వ సమీకరణను మించిన ప్రభావం చూపించాయి. సమాజ్‌వాది పార్టీ చాకచక్యంగా నడిపిన కుల సమీకరణ రాజకీయాలు ఇందుకు తోడైనాయి. అయోధ్యకు నెలవుగా వున్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించే బిజెపి సభ్యుడు ఓడిపోవడం ఓటరు ఎంత దూరమైనారో కళ్లకు కట్టే కఠోర వాస్తవంగా నిలిచింది.

> ఏమైనా నిరంతరం అప్రమత్తంగా వుండటం ఇప్పటికీ అవసరమే. ఎందుకంటే నిరంకుశ హిందూత్వ లక్షణాలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి జన్యుధాతువుల్లోనే వున్నాయి. తమ ఎజెండాను ముందుకు నెట్టడానికి ప్రత్యక్షంగా కాకపోతే రహస్యంగా మార్గాలు నిరంతరం వారు అన్వేషిస్తూనే వుంటారు. ఈ కారణంగానే పార్లమెంటులో, అంతకంటే ముఖ్యంగా సభ వెలుపలా సమైక్య ప్రతిపక్షం పాత్ర కీలకమవుతుంది. 'ఇండియా' వేదిక పార్టీలు ఒక ఉమ్మడి వేదిక ద్వారా సమన్వయాన్ని మెరుగుపర్చుకుని పనిచేయాల్సి వుంటుంది. 'ఇండియా' కలయిక పార్టీల కొద్ది మాసాల అనుభవాన్ని గమనిస్తే ఒక కచ్చితమైన కూటమిగా గాక విశాల వేదికగా వ్యవహరించడం ఉపయుక్తమని తేలింది.

ఎగ్జిట్ ప్రహసనం

ఏడవ చివరి దశ పోలింగ్ ముగిశాక వెల్లువగా వచ్చిన ఎగ్జిట్‌పోల్స్ ఎన్‌డిఎ గొప్ప విజయం సాధించబోతున్నదన్న చిత్రణ ఇచ్చాయి. సగటున చూస్తే బిజెపికి కనీసంగా 367 వస్తాయని చెప్పాయి. ప్రతిపక్షాలను డీలా పడేసి పాలక పార్టీ ఆధిపత్యానికి కొమ్ము కాయడానికి ప్రయోగించిన ఆయుధాలే ఇవి. మరింత లోతైన ఉద్దేశం మీడియా కార్పొరేట్ కూటమితో స్టాక్ మార్కెట్‌లో లాభాలు కొల్లగొట్టడం. దీనంతటి వల్ల ముంబాయి స్టాక్ ఎక్స్‌చేంజిలో మదుపరుల పెట్టుబడి 14 లక్షల కోట్లు పెరిగింది.

ఎ.పి, ఒడిషా పాఠాలు

పార్లమెంటుతోపాటు శాసనసభ ఎన్నికలు కూడా జరిగిన ఒడిషాలో బిజూ జనతాదళ్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్‌ఆర్‌సిపి ఈ ఎన్నికల్లో అధికారం కోల్పోయాయి. అవి లోక్‌సభ ఎన్నికలలో దెబ్బ తినడమేగాక రాష్ట్ర ప్రభుత్వాలను కూడా పోగొట్టుకున్నాయి. ఒడిషాలోని 21 లోక్‌సభ స్థానాలలో బిజెపి 20 స్థానాలు తెచ్చుకోవడమే గాక శాసనసభలోనూ మెజార్టీ తెచ్చుకుంది. మోడీ ప్రభుత్వంతో జతకట్టే లేదా వత్తాసునిచ్చే ప్రాంతీయ పార్టీలకు ఈ రెండు రాష్ట్రాలూ ఒక గుణపాఠం నేర్పుతున్నాయి. బిజెపిని గట్టిగా వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలు డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి వంటివే నిలదొక్కుకుని మరింత బలోపేతమైనాయి.

బాహుబలి బదాబదలు

నరేంద్ర మోడీ స్వయంగానూ బిజెపి పార్టీగానూ ఎంతో శ్రమించి పెంచిన బాహుబలి ప్రచార చిత్రాన్ని మొత్తంగా ఈ తీర్పు నేలకు దించింది. బిజెపి ఇంత గట్టి దెబ్బ తిందంటే దానికి పూర్తి కారకుడు మోడీనే. దీని వెనక అసలు కుట్రదారి బిజెపినే. ఆ పార్టీ ఎన్నికల ప్రణాళిక కూడా మోడీకే గ్యారంటీ అని నామకరణమైంది. మోడీ చుట్టూ సృష్టించబడిన అజేయత్వం కథలు కకావికలైపోయాయి. ఎన్‌డిఎ మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటుతోనైనా మోడీ, అమిత్‌షాల బరితెగింపు పోకడలకు కళ్లెం పడుతుందని ఆశించాలి. ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల బలమేమీ వుండబోదు. ఒకే దేశం - ఒకే ఎన్నిక వంటి అనర్థక పథకాలను తీసుకొచ్చే ఆలోచనలు దీంతో చిన్నాభిన్నమైనట్టే. మూడో దఫా అధికారంలోకి రాగానే ఏక కాలంలో ఎన్నికల వ్యవస్థ తీసుకొస్తామని అమిత్ షా వాగ్దానం చేశారు. దానికోసం అవసరమైన అనేక రాజ్యాంగ సవరణలు తీసుకొస్తామన్న ఆయన మాట ఇక అమలు జరిగేది కాదు.

'ఇండియా' అనుభవాలు

ఏమైనా నిరంతరం అప్రమత్తంగా వుండటం ఇప్పటికీ అవసరమే.

> నరేంద్ర మోడీ స్వయంగానూ బిజెపి పార్టీగానూ ఎంతో శ్రమించి పెంచిన బాహుబలి ప్రచార చిత్రాన్ని మొత్తంగా ఈ తీర్పు నేలకు దించింది. బిజెపి ఇంత గట్టి దెబ్బ తిందంటే దానికి పూర్తి కారకుడు మోడీనే. దీని వెనక అసలు కుట్రదారి బిజెపినే. ఆ పార్టీ ఎన్నికల ప్రణాళిక కూడా మోడీకే గ్యారంటీ అని నామకరణమైంది. మోడీ చుట్టూ సృష్టించబడిన అజేయత్వం కథలు కకావికలైపోయాయి. ఎన్‌డిఎ మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటుతోనైనా మోడీ, అమిత్‌షాల బరితెగింపు పోకడలకు కళ్లెం పడుతుందని ఆశించాలి.

ఎందుకంటే నిరంకుశ హిందూత్వ లక్షణాలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి జన్యుధాతువుల్లోనే వున్నాయి. తమ ఎజెండాను ముందుకు నెట్టడానికి ప్రత్యక్షంగా కాకపోతే రహస్యంగా మార్గాలు నిరంతరం వారు అన్వేషిస్తూనే వుంటారు. ఈ కారణంగానే పార్లమెంటులో, అంతకంటే ముఖ్యంగా సభ వెలుపలా సమైక్య ప్రతిపక్షం పాత్ర కీలకమవుతుంది. 'ఇండియా' వేదిక పార్టీలు ఒక ఉమ్మడి వేదిక ద్వారా సమన్వయాన్ని మెరుగుపర్చుకుని పనిచేయాల్సి వుంటుంది. 'ఇండియా' కలయిక పార్టీల కొద్ది మాసాల అనుభవాన్ని గమనిస్తే ఒక కచ్చితమైన కూటమిగా గాక విశాల వేదికగా వ్యవహరించడం ఉపయుక్తమని తేలింది. వైవిధ్యాలనూ, పరస్పరం పోలి వుండే రాజకీయ కార్యక్రమాలు, విధానాలను వేదిక ఇముడ్చుకునే వీలు కలిగింది. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వానికి కట్టుబాట్లు సూత్రాలుగా పని చేయాలి. నిరంకుశ మతతత్వ ప్రమాదంపై పోరాటం ఎంత మాత్రం ముగియలేదు.

వామపక్షాలు బలోపేతం కోసం...

'ఇండియా' వేదిక సాధించిన విజయంలో భాగస్వాములైన సిపిఐఎం, వామపక్షాలు తమ తమ పార్టీల ఎన్నికల ఫలితాలను విమర్శనాత్మకంగా సమీక్షించుకోవాల్సి వుంటుంది. వామపక్షాల సీట్ల సంఖ్యలో స్వల్పమైన పెరుగుదల వచ్చింది. గత సభలో అయిదు సీట్లుండగా ఇప్పుడవి ఎనిమిదికి చేరాయి. సిపిఐఎం 4, సిపిఐ 2, సిపిఐ ఎంఎల్ 2 తెచ్చుకున్నాయి. కేరళలో సిపిఐఎం, ఎల్‌డిఎఫ్‌లు మరిన్ని సీట్లు తెచ్చుకోగలమని భావించగా వచ్చిన ఫలితాలు నిరుత్సాహపరిచేవిగా వున్నాయి. ఇందుకు కారణాలేమిటో ఆత్మ విమర్శనా పూర్వక పరిశీలన జరగాలి. లోపాలను గుర్తించాలి. రానున్న రోజుల్లో వామపక్షం మరింత బలోపేతం కావడం అత్యంత ప్రాధాన్యత గల అంశం. ఎందుకంటే హిందూత్వ కార్పొరేట్ శక్తుల కూటమిపై సమరం మరింత ఉధృతం కావడం అనివార్యం.

/ జూన్ 5 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

వైసిపి ఓటమి - కొన్ని కారణాలు

విశ్లేషణ

రాష్ట్ర విభజన తర్వాత, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మూడవసారి జరిగిన ఎన్నికలలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలై కేవలం 11 సీట్లకు పరిమితమైంది. తెలుగు దేశం పార్టీ కూటమి 164 సీట్లతో ప్రభంజనాన్ని సృష్టించింది. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ మొత్తం అన్ని ప్రాంతాలలో ఒకే రకమైన విజయాన్ని కూటమి సాధించింది. వై.యస్.జగన్ మోహన్ రెడ్డి మంత్రి వర్గంలో ఉన్న 26 మంది మంత్రులలో 24 మంది ఘోర పరాజయం పాలయ్యారు. పాత 13 జిల్లాలలో 8 జిల్లాలలోని వెసిపికి ఒక్క సీటు కూడా లభించలేదు. 2024 ఎన్నికలలో కూటమిలో తెలుగుదేశం పార్టీకి 45.60 శాతం, జనసేనకు 6.85 శాతం, బిజెపికి 2.83 శాతం ఓట్లు లభించాయి. వైసిపి 39.37 శాతం ఓట్లకే పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికలలో మొత్తం 25 స్థానాలకుగాను 21 స్థానాలు కూటమికి, 4 స్థానాలు వైసిపికి లభించాయి. ఇంత పెద్ద స్థాయిలో ఓటమికి కొన్ని కీలకమైన కారణాలను పరిశీలిద్దాం.

జగన్ మోహన్ రెడ్డి నిరంకుశ ధోరణి

2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజలతో మమేకమైన జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రజాస్వామ్య ధోరణికి భిన్నంగా నిరంకుశ, అహంభావ ధోరణితో పరిపాలన కొనసాగించారు. ప్రజలకు, ఆయనకు మధ్య 'ఇనుప తెర' ఏర్పడింది. వై.యస్.రాజశేఖర్‌రెడ్డి 2004-2009 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉండగా ఒక క్రమపద్ధతిలో ప్రజలను, ప్రజా ప్రతినిధులను, రాజకీయ నాయకులను, అధికారులను కలిసేవారు. ఉదయం 9 గంటల కల్లా బేగంపేట క్యాంప్ కార్యాలయంలో అనేక మందిని కలిసి వాళ్లు చెప్పే విషయాలను శ్రద్ధగా విని పరిష్కారానికి ప్రయత్నించేవారు. ఐదేళ్ల పాటు పాలన చేసిన జగన్ మోహన్ రెడ్డి ప్రజాప్రతినిధులను, శాసనసభ్యులను, పార్లమెంటు సభ్యులను, మంత్రులను, శాసనమండలి సభ్యులను, వివిధ యూనియన్ల నాయకులను, మేధావులను కలవడానికి ఇష్టపడలేదు. అనేక మార్గాల ద్వారా అందే సమాచారాన్ని ఆయన స్వీకరించలేదు. ఫలితంగా సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ రెడ్డి వంటి వారు ప్రధాన వ్యక్తులుగా రూపొంది...సమాచారం ముఖ్యమంత్రి వరకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు అంగన్‌వాడీలు 1,05,000 మంది 42 రోజుల పాటు సమ్మె చేస్తే దాని పరిష్కారంలో భాగంగా ముఖ్యమంత్రిని కలిసే అవకాశమే లభించ లేదు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు తమ ప్రాతినిధ్యాలు ముఖ్యమంత్రికి అందించే అవకాశం కార్యాలయంలో కాకుండా, జిల్లాలలో హెలిపాడ్‌ల వద్ద మాత్రమే లభించేది. దీని వలన ప్రజా ప్రతినిధులలో స్థానిక సంస్థల ప్రతినిధులలో తీవ్ర అసంతృప్తి, నిస్తేజం ఏర్పడింది. దీనితో పాటు 'వాలంటీర్ల వ్యవస్థ' పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత లేకుండా చేయడంతో కార్యకర్తలలో పార్టీ పరంగా ఉత్సాహం లోపించింది. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో స్థానిక సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రాధాన్యత కోల్పోయారు.



కె. యస్. లక్ష్మణరావు

మౌలిక వసతుల కల్పన ఏదీ?


ఐదేళ్ల పాలనలో సంక్షేమం కోసం 'బటన్ నొక్కుడు' (డి.బి.టి) ద్వారా ప్రజలకు రూ.2,70,000 కోట్లు అంద చేశామని ముఖ్యమంత్రి అనేక బహిరంగ సభలలో ప్రకటించారు. కానీ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను పూర్తిగా విస్మరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు నాలుగేళ్లలో రూ.62,000 కోట్లు కేటాయించి కేవలం రూ.31,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, హంద్రీ-నీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులు పూర్తి కావటానికి ఎటువంటి ఆసక్తి చూపించలేదు. గుంటూరు చానల్, వరికపూడిశెల వంటి చిన్న నీటి పారుదల ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించలేదు.

రాష్ట్రంలో మౌలిక వసతులు ముఖ్యంగా రోడ్ల నిర్మాణం పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపించారు. ప్రధానమైన రోడ్లు వేలాది కిలోమీటర్లు దెబ్బ తిన్నప్పటికీ వాటి నిర్మాణానికి ప్రయత్నించలేదు. రోడ్లకు పడిన గుంతల వలన అనేకమంది మరణించారు. మంత్రులు ఈ విషయాన్ని తేలికగా తీసుకున్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు

ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లను పూర్తిగా దూరం చేసుకున్నది. ప్రధానమైన యూనియన్లతో చర్చించడం కానీ, వారితో అనేక సమస్యలపై కానీ ముఖ్యమంత్రి మాట్లాడలేదు. చర్చలు కేవలం సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణలకే పరిమితమయ్యేవి. ప్రభుత్వం తమకనుకూలంగా ఉండే నలుగురు నాయకుల అభిప్రాయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నది. విజయవాడ బి.ఆర్.టి.ఎస్ రోడ్డులో 2022 ఫిబ్రవరి 3న జరిగిన మహోద్యమం తరువాత ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుండా ఉద్యమాలను అణచివేయడానికి పూనుకున్నది.

> విభజన తర్వాత రాష్ట్రం ఎదుర్కొన్న సమస్యలలో నిరుద్యోగం ప్రధానమైనది. రాష్ట్రంలో ఐ.టి రంగ పరిశ్రమలుగాని, ఇతర పరిశ్రమలుగాని అభివృద్ధి చెందలేదు. గత ఐదేళ్లుగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పనలో వైఫల్యం చెందింది. లక్షకు పైగా సచివాలయ ఉద్యోగాలు, మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగాలు మినహా మిగిలిన ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రతి సంవత్సరం 'జాబ్ క్యాలెండర్' విడుదల చేస్తామని చెప్పి, ఒక్కసారి మాత్రమే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ఇచ్చారు. గత ఐదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో దాదాపు 25 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, నిరుద్యోగ అభ్యర్థుల ఒత్తిడి వల్ల చివరిలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంకా పరీక్ష జరగలేదు. మెగా డిఎస్సీ ఇవ్వాలని ఎమ్మెల్సీలు, నిరుద్యోగులు, యువజన సంఘాలు ఒత్తిడి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గ్రూప్-2, గ్రూప్-1, గ్రూప్-3 వంటి పోస్టుల్లో వేల సంఖ్యలో ఖాళీలు ఉండగా వాటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు.



ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఇచ్చే వేతన సంఘం సిఫార్సులలో ముఖ్యంగా 11వ పి.ఆర్.సిలో పూర్తిగా అన్యాయం చేసింది. ప్రతి నెలా ఒకటవ తేదీకి జీతం రావడం గగనమైపోయింది. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఇప్పటికీ దాదాపు రూ.18,000 కోట్ల బకాయిలు చెల్లించవలసి ఉంది. వీటితో పాటు సి.పి.యస్ రద్దు చేస్తామన్న హామీని అమలు పరచకుండా జి.పి.యస్ అనే కొత్త విధానాన్ని సృష్టించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారారు. అదే విధంగా ఉపాధ్యాయులను యాప్‌ల పేరుతో, ప్రవీణ్ ప్రకాష్ విజిట్ల పేరుతో వేధించడంతో పాఠశాలల మౌలిక వసతులు కొంత మెరుగుపడినప్పటికీ ఉపయోగం లేకుండా పోయినది.

కక్ష సాధింపు ధోరణి

గెలుపొంది అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పార్టీ అయినా, నాయకుడైనా సంయమనంతో వ్యవహరించాలి. ప్రత్యేకించి పరిపక్వత కలిగి ఉండాలి. కానీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించింది. అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే ప్రజావేదికను కూల్చివేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ పేరుతో చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేసి అనేక రోజులపాటు జైలులో ఉంచటం ప్రజలలో సానుభూతి కలగచేసింది. అంతేగాక ల్యాండ్ టైట్లింగ్ చట్టం పట్ల రైతులలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో రాజకీయ కక్షలతో ప్రతిపక్ష పార్టీలపై దాడులు జరగటాన్ని కూడా ప్రజలు వ్యతిరేకించారు. ఎన్.టి.ఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరు మార్పును ప్రజలు హర్షించలేదు.వీటితోపాటు ప్రజాస్వామ్యంలో నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు అతి సహజమైన విషయం. ఏ ప్రభుత్వం ఉన్నా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు వీటిని నిర్వహిస్తూ ఉంటాయి. కానీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ నిరసన కార్యక్రమాలను క్రూరంగా అణచివేయడానికి పోలీస్ యంత్రాంగాన్ని పూర్తిగా ఉపయోగించింది.

నిరుద్యోగం

ఆంధ్రప్రదేశ్ విభజన (2014లో) తర్వాత రాష్ట్రం ఎదుర్కొన్న సమస్యలలో నిరుద్యోగం ప్రధానమైనది. రాష్ట్రంలో ఐ.టి రంగ పరిశ్రమలుగాని, ఇతర పరిశ్రమలుగాని అభివృద్ధి చెందలేదు. గత ఐదేళ్లుగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పనలో వైఫల్యం చెందింది. లక్షకు పైగా సచివాలయ ఉద్యోగాలు, మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగాలు మినహా మిగిలిన ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రతి సంవత్సరం 'జాబ్ క్యాలెండర్' విడుదల చేస్తామని చెప్పి, ఒక్కసారి మాత్రమే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ఇచ్చారు. గత ఐదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో దాదాపు 25 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, నిరుద్యోగ అభ్యర్థుల ఒత్తిడి వల్ల చివరిలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంకా పరీక్ష జరగ లేదు. మెగా డిఎస్సీ ఇవ్వాలని ఎమ్మెల్సీలు, నిరుద్యోగులు, యువజన సంఘాలు ఒత్తిడి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గ్రూప్-2, గ్రూప్-1, గ్రూప్-3 వంటి పోస్టుల్లో వేల సంఖ్యలో ఖాళీలు ఉండగా వాటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. వయోపరిమితి పెంచలేదు. ఈ ఎన్నికలలో నగదు బదిలీ ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలలోని నిరుద్యోగులు కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేశారు.

ప్రజా వ్యతిరేకత

మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి అసలు రాజధానే లేకుండా చేసిన వైనం, రాష్ట్రానికి ఎంత ద్రోహం చేసినా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో అంటకాగడం వంటి కారణాల వల్ల...గత ఐదేళ్లుగా పాలించిన వైసిపి ప్రభుత్వం పట్ల వివిధ తరగతుల ప్రజలలో అసంతృప్తి ఏర్పడింది. ప్రజలను సంతృప్తి పరచాలంటే 'బటన్ నొక్కుడు' ఒక్కటే చాలదని ఈ ఎన్నికలు నిరూపించాయి. సమాజంలోని రైతులు, కార్మికులు, సంఘటిత ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మధ్య తరగతి ప్రజలు, యువకులు మొదలగు వారందరినీ సంతృప్తి పరచాలి. 'బటన్ నొక్కుడు' (డి.బి.టి)...నయా ఉదారవాద విధానాల అమలులో ప్రపంచ బ్యాంక్ ఆదేశాలతో అమలు జరుగుతున్న ఒక విధానం మాత్రమే. వైసిపికి శాసనసభ స్థానాలు 11 మాత్రమే వచ్చినప్పటికీ 39.37 శాతం ఓట్లు వచ్చాయి. ఇవి తక్కువేమీ కాదు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షానికి ముఖ్యమైన పాత్ర ఉన్నది. బాధ్యతాయుత ప్రతిపక్షంగా రాబోయే ఐదేళ్లు వైసిపి సమర్థవంతంగా పని చేయాలని ఆశిద్దాం.

/ వ్యాసకర్త శాసనమండలి సభ్యులు, సెల్ : 8309965083/

వ్యాఖ్య



ప్రజలంటే....?

ప్రజలంటే తేలిక కాదు.
ఓటు అంటే నాలుక కాదు
ఓ ఆలోచనకు ఆగ్రహమొస్తే
ప్యాలెస్లు కూలతాయి.

ప్రజలంటే చులకన కాదు
సిద్ధం అంటే సిగ్గు
వదులుకోనే సన్యాసులు కారు.
ఓ ఆచరణ మొదలైతే
ఓటమి బటన్ నొక్కుతారు.

ప్రజలంటే పలుచన కాదు
డబ్బుతో కొనుక్కునే పశు
వులు కారు
తమను తాము కాపాడుకునే
నిజంతో నడిచే
బలవంతులు.

ప్రజలంటే పిచ్చివాళ్ళు కారు
మౌనంగా అన్నీ వింటూ
మనసుతో నడుచుకొనే
ఓటు విలువ తెలిసిన
విలువైన వాళ్ళు.

- చందలూరి నారాయణరావు,
సెల్ : 9704437247

మీ రచనలను పంపాల్సిన
మెయిల్ :
editpageps@gmail.com

పాఠాలు నేర్పిన ఫలితాలు !

- ఓట్లు రాల్చని 'హిందూత్వ'
- ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ అపజయాలే
- పార్టీలో రాజుకుంటున్న అసమ్మతి కుంపట్లు
- మిత్రుల నుంచీ ఒత్తిళ్లు తప్పవా?



న్యూఢిల్లీ : లోక్‌సభలో బిజెపి అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ఆ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో ఇండియా వేదిక విజయం సాధించింది. ఈ క్రమంలో ఇండియా వేదిక అనేక అవరోధాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇద్దరు ముఖ్యమంత్రులను జైలుకు పంపారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రధాన స్రవంతి మీడియా బిజెపి కుమ్మక్కైంది. ప్రతిపక్షాలకు నిధులు అందకుండా ఎక్కడికక్కడ అష్టదిగ్బంధం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకూ సమానావకాశాలు లభించి ఉంటే ఇండియా కూటమి కచ్చితంగా మ్యాజిక్ ఫిగర్ 272ని దాటేసి ఉండేది. కానీ అది అసాధ్యమైంది. అయినప్పటికీ ఇండియా వేదిక ఛైర్‌పర్సన్ మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతి ఒక్క ప్రతిపక్ష నాయకుడూ ప్రజల హృదయాలను గెలుచుకున్నారు.

అసాధారణ రీతిలో వచ్చిన ఫలితాలను ప్రజా విజయంగా అందరూ భావించారు. అనేకమంది భారతీయులు దీనిని తమ వ్యక్తిగత విజయంగా తీసుకొని సంబరాలు చేసుకున్నారు. ఎందుకంటే వారు భారతీయ ఆత్మ కోసం జరిగిన చారిత్రక పోరాటంలో భాగస్వాములయ్యారు.

అంతర్గత తిరుగుబాట్లు అనివార్యం

బిజెపి ఓటమికి కారణాలు అనేకం. ఆ పార్టీలో సంస్థాగత సమస్యలు వేళ్లూనుకుపోయాయి. మోడీ పాలనలో బిజెపి సంస్థాగతంగా బలహీనపడింది. పైగా బిజెపి, సంఘ్ పరివార్ మధ్య సంబంధాలు సజావుగా సాగలేదు. అధికార పంపిణీ, ఆధిపత్యం విషయంలో తీవ్రమైన విభేదాలు పొడసూపాయి. ప్రత్యామ్నాయ అధికార కేంద్రాలు ఏర్పడకుండా నరేంద్ర మోడీ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. విధేయత చూపని అభ్యర్థుల ఓటమికి చేయాల్సిందంతా చేశారు. అయితే వీరిలో చాలా మంది గెలుపొందడంతో రాబోయే ఐదు సంవత్సరాల్లో పార్టీలో అంతర్గతంగా తిరుగుబాటు చోటుచేసుకునే అవకాశం ఉంది.

ప్రతికూల పరిస్థితులు తప్పవు

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. గతంలో దూరమైన పార్టీలే ఇప్పుడు బిజెపికి చేరువయ్యాయి. ఆయా పార్టీలతో సంబంధాలు కొనసాగించడం మోడీకి అసౌకర్యంగానే ఉంటుంది. పైగా గతంలో తమకు ఎదురైన చేదు అనుభవాలను తెలుగుదేశం, జేడీయూ వంటి పార్టీలు ఎన్నటికీ మరచిపోలేవు. ఇప్పుడు తమకు అవకాశం రావడంతో ఆయా పార్టీలు తమ డిమాండ్ల చిట్టాను మోడీ ముందు ఉంచి వాటిని నెరవేర్చాల్సిందిగా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. పులి మీద పుట్రలా కొన్ని మత సంస్థలు కూడా ఇప్పుడు ధిక్కార స్వరాన్ని విన్పిస్తున్నాయి. అయోధ్య ట్రస్ట్ తమను పట్టించుకోలేదని, కించపరిచాయని ఆ సంస్థలు గుర్రుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ గత వైభవాన్ని, ప్రాభవాన్ని కనబరచడం అసాధ్యం. ఆయన తీవ్రమైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

దూకుడు తప్పదు

బిజెపిని ఈ పరిణామాలను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మలచుకోవాల్సి ఉంటుంది. గత ఐదు సంవత్సరాలుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ విధంగా అయితే దూకుడుగా వ్యవహరించి బిజెపి సైద్ధాంతిక అజెండాను ఎండగట్టారో ఇండియా వేదికలో ఇతర పార్టీల నేతలు కూడా ఇకపై అదే విధమైన వైఖరిని ప్రదర్శించాలి. తనపై బిజెపి నాయకత్వం ఎంతగా ద్వేషపూరిత ప్రచారం చేసినప్పటికీ రాహుల్ చెక్కుచెదరక మొక్కవోని ధైర్యంతో ముందుకు నడిచారు. ప్రభుత్వ సామాజిక, ఆర్థిక విధానాలను తూర్పార పట్టారు. ఎన్నికల బాండ్ల పథకంలో చోటుచేసుకున్న కుంభకోణాన్ని ప్రజలకు వివరించడంలో సఫలీకృతులయ్యారు.

ఇది తొలి అడుగే

ఇటీవలి కాలంలో పలు ప్రగతిశీల శక్తులు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేశాయి. సినీ నిర్మాతలు, రచయితలు, కవులు, వివిధ సంఘాలు, వ్యాపారులు, యూట్యూబర్లు ఈ మహాయజ్ఞంలో భాగస్వాములయ్యారు. ఆనాడు ఏ కారణం చేతనో బయటికి రాలేని శక్తులు ఇప్పుడు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఇండియా వేదికకు బాసటగా నిలిచేందుకు ముందుకొచ్చాయి. పార్లమెంట్ లేదా రాష్ట్రాల చట్టసభల వద్ద నిరసనలు, బహిరంగ లేఖలు, పిటిషన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాలు, పత్రికా సమావేశాలు, ఉపన్యాసాలు...ఇలా వివిధ రూపాల్లో గత పది సంవత్సరాలుగా ప్రజలు ప్రభుత్వంపై తమ అసమ్మతిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఐదు సంవత్సరాలుగా వ్యూహాత్మకంగా సాగిన ఉద్యమ కార్యాచరణ బీజేపీని ఎన్నికల్లో ఓడించడమే కాకుండా సైద్ధాంతికంగా కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ఇదే అసలైన పోరాటం. ఎన్నికల్లో గెలుపు అనేది తొలి అడుగు మాత్రమే. మున్ముందు చేయాల్సిన కృషి చాలా ఉంది. ఇందుకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇప్పుడు అనుకూలంగా ఉన్నాయి.

ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ తప్పని ఓటమి

హిందూత్వను హైజాక్ చేసేందుకు ప్రయత్నించిన బిజెపి చివరికి ఫైజాబాద్‌లో కూడా ఓటమి పాలైంది. స్రవస్తి, సీతాపూర్, చిత్రకూట్, మయాపూర్, షిర్డీ, తిరుపతి, రామనాథపురం వంటి ఆధ్యాత్మిక కేంద్రాల్లో కూడా బిజెపికి పరాభవం తప్పలేదు. హిందూత్వ వాదాన్ని తలకెత్తుకున్నప్పటికీ అనేక హిందూ దేవాలయ ట్రస్ట్ బోర్డులు బిజెపికి గుడ్డిగా మద్దతు ఇవ్వకపోవడం గమనార్హం. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులకు వ్యతిరేకంగా హిందువులను పోటీకి నిలబెట్టినప్పటికీ ప్రజలు బిజెపికి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. మతపరమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం చేసిన వారికి ఇది ఓ గుణపాఠం. చివరికి వారణాసిలో మోడీ మెజారిటీ కూడా పడిపోయింది. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ వంటి నినాదాలు ఇచ్చినప్పటికీ దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు ఇండియా వేదికకు ఓటేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ఎలా ఉన్నప్పటికీ మోడీ, షా ద్వయానికి దేశానికి నేతృత్వం వహించే నైతిక హక్కు మాత్రం లేదు.

శాసనసభ ఎన్నికలకు సంసిద్ధత

దేశంలో గాలి మార్పు స్పష్టంగా కన్పించింది. ప్రజలందరూ కులాలు, మతాలకు అతీతంగా గంగా-జమునీ తహ్జీబ్ రక్షణ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టారు. వసుధైక కుటుంబంపై విశ్వాసం ప్రకటించారు. ఇక వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వారంతా ఓ తనిర్ణయానికి వచ్చారు. ఈ సంవత్సరం చివర్లో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో కూడా బిజెపికి చేదు అనుభవాలు మిగిల్చేందుకు ఇండియా వేదిక సిద్ధమవుతోంది. ఎందుకంటే అదేమంత కష్టం కాదు.

ఐఎస్‌ఎస్‌లో సునీతా విలియమ్స్ చిందులు

- ఆనందోత్సాహాలతో మురిసిన వ్యోమగాములు
- వీడియోలు విడుదల చేసిన నాసా

వాషింగ్టన్ : భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ శుక్రవారం ఉదయం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి ప్రవేశించారు. వీరిద్దరిని తీసుకెళ్ళిన నాసా బోయింగ్ స్టార్‌లైనర్ 5వ తేదీన ఫ్లోరిడాలోని కేప్ కేన్వరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుండి బయలుదేరి 26 గంటల ప్రయాణం అనంతరం అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌తో అనుసంధానమైంది. వారిద్దరు లోపలకు ప్రవేశిస్తున్న దృశ్యాలను నాసా విడుదల చేసింది. అప్పటికే లోపల వున్న 'ఎక్స్‌పెడిషన్-71'కు చెందిన ఏడుగురు వ్యోమగాములు సునీత, బుచ్‌లను ఘనంగా స్వాగతించారు. లోపలకు వెళ్లగానే సునీతా విలియమ్స్ ఆనందంతో చిందులు వేశారు. ఆమె నృత్యం చేస్తున్న వీడియోను కూడా నాసా విడుదల చేసింది. లోపల వున్న వారిని హత్తుకుంటూ వారందరూ తన కుటుంబ సభ్యులని సునీతా వ్యాఖ్యానించారు. ఐఎస్ఎస్ కుటుంబంలో భాగస్వాములైనందుకు సంతోషంగా వుందని అన్నారు.

అయితే ఈ ప్రయాణంలో కూడా అనేక కొత్త సమస్యలు తలెత్తాయి. అనుకున్నంత సాఫీగా జరగలేదు. కానీ ఈ అడ్డంకులన్నింటినీ విజయవంతంగా అధిగమించి వారు రోదసీ స్టేషన్‌కు చేరుకున్నారు. 'ఆకాశంలోని అతిపెద్ద నగరంతో అనుసంధానించబడినందుకు ఆనందంగా వుంది' అంటూ బుచ్ విల్మోర్ వ్యాఖ్యానించారు. ఆయన బోయింగ్ స్టార్‌లైనర్‌లో మొదటిసారిగా ప్రయాణించారు. 'ఇక్కడ మనకు మరో కుటుంబం వుంది, ఇది చాలా అద్భుతంగా వుంది' అని విలియమ్స్ వ్యాఖ్యానించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టుల మృతి

నారాయణ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి)కు చెందిన ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. జిల్లాలోని గోబెల్, తుల్తులి గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఐటిబిపితో కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. నారాయణ్‌పూర్, కొండగావ్, దంతేవాడ, బస్తర్ జిల్లాలకు రిజర్వ్‌డ్ పోలీసులు, ఐటిబిపి 45వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు ఆపరేషన్‌లో పాల్గొనట్లు చెప్పారు. సంఘటనా స్థలంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మృతులు ఇంకా గుర్తించాల్సి ఉందని చెప్పారు. కాగా, తాజా ఎన్‌కౌంటర్‌తో కలిసి గత ఏడాది కాలంలో ఇప్పటి వరకు 125 మంది మావోయిస్టులు వేరువేరు ఎన్‌కౌంటర్లల్లో మృతి చెందారు. మే 23న నారాయణ్‌పూర్ - బిజాపూర్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అంతకుముందు మే 10న ఇదే ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో 12 మంది మరణించారు.

ఉన్నావ్ బాధితురాలి తండ్రి హత్య కేసులో బిజెపి నాయకుడికి శిక్ష రద్దుకు నిరాకరణ

న్యూఢిల్లీ : ఉన్నావ్ అత్యాచార బాధితురాలి తండ్రి హత్య కేసులో బిజెపి నాయకుడు కుల్దీప్ సెంగార్‌కు విధించిన 10 ఏళ్ల జైలు శిక్షను రద్దు చేయడానికి ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. ప్రస్తుత దశలో శిక్షను రద్దు చేయడానికి కోర్టు అనుకూలంగా లేదు, సెంగార్ పిటీషన్‌ను కొట్టివేస్తున్నామని జస్టిస్ స్వరణ కాంత శర్మ తీర్పులో పేర్కొన్నారు. ఇప్పటికే 6 ఏళ్ల శిక్షను అనుభవించానని, మిగిలిన శిక్షను రద్దు చేయాలని సెంగార్ తన పిటీషన్‌లో కోరారు. దీనికి జడ్జి 'శిక్షను రద్దు చేయడంపై నిర్ణయం తీసుకునే సందర్భంలో నేర స్వభావం, నేర తీవ్రత, నేరంలో దోషి పాత్ర వంటి అంశాలు ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం. కేవలం జైలుల్లో గడిపిన కాలం ఆధారంగానే నిర్ణయం తీసుకోం' అని స్పష్టం చేశారు.

ఇయు పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభం

బ్రస్సెల్స్ : రాబోయే ఐదేళ్ళ కాలానికి యురోపియన్ పార్లమెంట్ కూర్పు ఎలా వుండాలో నిర్ణయించేందుకు యురోపియన్ యూనియన్ (ఇయు)లోని 27 సభ్య దేశాలు గురువారం నుండి ఆదివారం వరకు ఓటు వేయనున్నాయి. ఇయుకు రాజకీయ దిశా నిర్దేశం చేయగల, ఇయు చైనా విధానాన్ని రూపొందించగల ప్రభావం ఈ ఎన్నికల ఫలితాలకు వుంది. ఈ ఎన్నికలను దృష్టిలో వుంచుకునే, చైనా ఎలక్ట్రిక్ వెహికల్స్‌పై టారిఫ్‌లకు సంబంధించి నిర్ణయాన్ని ఈ నెల 10 వరకు ఇయు వాయిదా వేసింది. ఎన్నికల ప్రచార పరిధిలోకి ఈ అంశాన్ని తీసుకురాకూడదని భావించే ఈ చర్య తీసుకుంది. ప్రత్యక్షంగా ఎన్నికయ్యే ఏకైక ఇయు సంస్థ యురోపియన్ పార్లమెంట్, ఇది యురోపియన్ కమిషన్, కౌన్సిల్ వంటి ఇయు కార్యనిర్వాహక బ్రాంచ్‌లతో యురోపియన్ పౌరులను కలుపుతుంది. ఆదివారం సాయంత్రానికల్లా ఏ ఏ పార్టీలు పార్లమెంట్‌లో ఎన్ని సీట్లను గెలుచుకున్నాయో తెలిసిపోతుంది. ప్రతి దేశం యొక్క జనాభా నిష్పత్తికి తగిన రీతిలో యురోపియన్ పార్లమెంట్‌లో ఆ దేశానికి సభ్యులు వుంటారు.

ప్రధానంగా రెండు అతిపెద్ద పార్టీలు మధ్యే మితవాద యురోపియన్ పీపుల్స్ పార్టీ (ఇపిపి), మధ్యే వామపక్ష ప్రగతిశీల కూటమి సోషలిస్ట్స్ అండ్ డెమోక్రాట్స్ (ఎస్ అండ్ డి) పార్లమెంట్‌లో వున్నాయి. ఇవి కాకుండా ఇంకా మరికొన్ని పార్టీలు కూడా వున్నాయి. ప్రధానంగా మితవాద, అతి మితవాద పార్టీలు లబ్ధి పొందే అవకాశాలు వున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే శరణార్థులు, జీవనోపాధులు, ఇంధన సంక్షోభం వంటి సమస్యలను పరిష్కరించడంలో ఈ పార్టీలు విఫలమయ్యాయని భావిస్తున్నారు. ఇక దేశీయ సమస్యలు, జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే పార్టీలు నెమ్మదిగా ప్రాధాన్యత పొందుతున్నాయి. ప్రస్తుత యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్ కూడా తిరిగి పోటీ పడుతున్నారు. అమెరికా అనుకూల వైఖరితో వ్యవహరించే ఆమె తిరిగి ఎన్నికైతే చైనా-ఇయు సంబంధాలు దెబ్బతినవచ్చు. బడ్జెట్ ప్రణాళికలను ఆమోదించే హక్కు కూడా పార్లమెంట్‌కు వున్నందున, ఈ కూర్పులో మార్పు ఏం జరిగినా అది ఉక్రెయిన్‌కు ఇయు సాయాన్ని ప్రభావితం చేస్తుంది.

జెలెన్‌స్కీకి బైడెన్ క్షమాపణలు

న్యూయార్క్ : అమెరికా అధ్యక్షులు జోయ్ బైడెన్ ఉక్రెయిన్ అధినేత వ్లాదిమిర్ జెలెన్‌స్కీకి క్షమాపణలు చెప్పారు. కీవ్‌కు సకాలంలో సహాయాన్ని అందజేయడంలో జాప్యం జరిగినందుకు ఆయన ఈ క్షమాపణలు కోరారు. ఇరువురు నేతలు డి-డే వార్షిక వేడుకల్లో భాగంగా పారిస్‌లో సమావేశమయ్యారు. ఉక్రెయిన్ ఎలక్ట్రిక్ గ్రిడ్ పునరుద్ధరణ కోంస 225 మిలియన్ డాలర్ల సాయాన్ని అందజేస్తామని ఈ సందర్భంగా బైడెన్ ప్రకటించారు. రష్యాపై ఉక్రెయిన్ ఉసిగొల్పి తద్వారా అక్కడ పాగా వేసేందుకు కుయుక్తులు పన్నుతున్న అమెరికా ఈ క్రమంలో ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున ఆయుధాలను, సైనిక సహాయాన్ని అందజేసిన సంగతి తెలిసిందే. ఇక నుంచి పూర్తిస్థాయిలో సహాయాన్ని అందజేస్తామని బైడెన్ ప్రకటించారు.

బలగాల మోహరింపు లేదు : నాటో

ఉక్రెయిన్‌లో బలగాలను మోహరించే ఆలోచనలేవీ ప్రస్తుతానికి నాటోకు లేవని నాటో సెక్రటరీ జనరల్ జేన్స్ స్టోలెన్‌బర్గ్ గురువారం ఇక్కడ చెప్పారు. ఫిన్లాండ్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇక్కడకు వచ్చిన ఆయన ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో కలిసి పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఉక్రెయిన్‌కు తాము మద్దతునివ్వడం కోసం మరింత బలమైన వ్యవస్థను ఎలా ఏర్పాటు చేయవచ్చనే అంశంపైనే తాము దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఉక్రెయిన్‌కు బలగాలు పంపాలని ఫిన్లాండ్ కూడా భావించడం లేదని చెప్పారు. అయితే ఉక్రెయిన్‌కు ఇతరత్రా ఏ విధంగా మద్దతు అందచేయాలో మిత్రపక్షాలతో కలిసి ఆలోచిస్తోందన్నారు. రష్యా నుండి ప్రస్తుతానికి ఏ నాటో మిత్రపక్షానికి కూడా ఎలాంటి ముప్పు లేదన్నారు.

గాజాలో 8 నెలలుగా ఇజ్రాయిల్ నరమేధం

- వేలాది మంది సామాన్య పౌరుల హననం
- చిన్నారులు, మహిళలు అని తేడా లేకుండా దాడులు
- ఆసుపత్రులను, పాఠశాలలను వదలని ఉన్మాదం



ఇజ్రాయిల్ దాడులతో శిథిలాల కుప్పగా కనిపిస్తున్న గాజాలోని ఒక ప్రాంతం

గాజా : గాజాపై ఇజ్రాయిల్ అమానవీయ దాడులు మొదలై 8 నెలలు గడిచాయి. అమెరికా అండదండలతో నెతన్యాహు సాగిస్తున్న యుద్ధోన్మాద సైనిక దాడులకు వేలాది మంది సామాన్యులు ప్రాణాలు కోల్పయారు. శుక్రవారానికి గడిచిన 24 గంటల్లో మరో 77 మంది పాలస్తీనియన్లు మరణించారు. 221 మంది గాయపడ్డారు. ఇప్పటి వరకు మృతుల సంఖ్య 36,731కి చేరింది. 83,530కి పైగా పౌరులు గాయపడ్డారు. ఈ నరమేధంలో చిన్నారులు, మహిళలు కూడా పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు.

2010లో గాజా సంక్షోభంపై పుస్తకం రాస్తూ ప్రముఖ రచయిత, ప్రొఫెసర్ నోమ్‌చోమ్‌స్కీ రాసిన కొటేషన్ ఈనాటికీ సరిగ్గా సందర్భానికి అతికినట్లు సరిపోతుంది. "రాజకీయ ప్రయోజనాల కోసం పాలస్తీనియన్లకు అంతులేని నొప్పి, బాధ కలిగించడమనేది రాజ్యహింస, భయోత్పాతానికి మరో సుదీర్ఘ సిద్ధాంతం-వాస్తవానికి దాని మార్గదర్శక సూత్రం కూడా." అన్నది ఆ కొటేషన్. గత ఎనిమిది మాసాలుగా అంతులేని రీతిలో సాగుతున్న ఈ దాడులు పెను మానవ విషాదాన్ని, విధ్వంసాన్ని నమోదు చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ కూడా ప్రజానీకం ఇలాంటి దాడులను చూడలేదు. ఈ భూమండలంపైనే అత్యంత జనసాంద్రత కలిగిన గాజాలో విధ్వంసం సాగిన తీరు ఊహకు అందని రీతిలో వుంది. ఆ క్రూరత్వాన్ని, వారి కక్ష సాధింపును చూస్తుంటే మనస్సు చలించిపోతోంది.

శిథిలాలు, రాళ్ల రప్పలతో మట్టిదిబ్బల కుప్పగా గాజా మారింది. ఇళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, దుకాణాలు, బజార్లు మసీదులు, గ్రంథాలయాలు, ఇలా ప్రజా జీవనానికి పనికివచ్చేవి ఏవి వుంటాయో అవన్నీ కూడా నేలమట్టమైపోయాయి. అసలు పాలస్తీనా ప్రజలకు, ఇజ్రాయిల్ ప్రజలకు మధ్య తలెత్తిన ఈ ఘర్షణను పరిష్కరించాలని ఎవరైనా అనుకుంటే ముందు వారు సమస్య మూలాల్లోకి వెళ్ళాల్సి వుంటుంది. అలాగే ఈ ఘర్షణల చరిత్ర ఒకసారి తవ్వి తీస్తే కారణాలు కూడా కనబడతాయి. ఈ దాడులతో శూన్యం చోటు చేసుకోకుండా చూడడం చాలా ముఖ్యమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదరిశ గుటెరస్ వ్యాఖ్యానించారు. 56 ఏళ్ల పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ దురాక్రమణ సమస్యను అనుభవిస్తున్నారు. ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్ల రూపంలో బరితెగిస్తూ ఆక్రమిస్తూపోతుండటంతో పాలస్తీనియన్ల భూమి క్రమేపీ దూరమవుతోంది. హింస అట్టుడుకుతోంది. వారి ఆర్థిక వ్యవస్థ నలిగిపోతోంది. వారి ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ఇంతలా ఆక్రమణలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సహజంగానే పాలస్తీనియన్లు ఎలాంటి అడ్డు ఆటంకం లేని రీతిలో స్వేచ్ఛను కోరుకుంటున్నారు. అచంచలమైన స్ఫూర్తితో పాలస్తీనా ప్రజానీకం స్వేచ్ఛ కోసం పోరాడడం కూడా సహజమే.

80 శాతానికి నిరుద్యోగం : ఐఎల్‌ఒ

ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో జిడిపి క్షీణించిందని, నిరుద్యోగం 80 శాతానికి చేరుకుందని అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌ఒ), పాలస్తీనా సెంట్రల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పిసిబిఎస్) నివేదికలు తెలిపాయి. నిరుద్యోగిత రేటు గాజా స్ట్రిప్‌లో 79.1 శాతానికి, వెస్ట్‌బ్యాంక్‌లో 32 శాతానికి చేరుకుందని వెల్లడించాయి. ప్రజలు జీవనోపాధి, ఉద్యోగాలు కోల్పోయారని నివేదికలు తెలిపాయి. అలాగే, జిడిపి రేటు గాజాలో 83.5 శాతం, వెస్ట్‌బ్యాంక్‌లో 22.7 శాతం తగ్గింది. మొత్తంగా ఈ రెండు ప్రాంతాల్లో జిడిపి గత ఎనిమిది నెలల్లో సగటున 32.8 శాతం తగ్గింది. ఇజ్రాయిల్ చేస్తున్న భయంకరమైన యుద్ధం మానవ జీవితాలను బలితీసుకోవడమే కాకుండా.. జీవన పరిస్థితులను దారుణంగా మార్చిందని నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్థిక కార్యక్రమాలు, జీవనోపాధులు విధ్వంసమయ్యాయని తెలిపాయి.



ఎన్‌డిఎ సమావేశం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన నేతలు

ఎన్‌డిఎ నేతగా మోడీ

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తల శ్రమ వుందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మోడీ ప్రశంసలు కురిపించారు. "ఇక్కడ కూర్చున్నాడు చూడండి.. ఈయన పవన్ కల్యాణ్ కాదు, తుఫాన్" అని సంబోధించారు. దానికి పవన్ కల్యాణ్ ఉబ్బితబ్బిబ్బయిపోయారు. ఏపి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డిఎ కూటమికి ప్రజలు అఖండ విజయం చేకూర్చారని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో కలిసి పవన్ కల్యాణ్ చారిత్రాత్మక విజయం సాధించారని అన్నారు.'కూటమిలో ఒకరిపై మరొకరికి నమ్మకం ఉండటం చాలా ముఖ్యమన్నారు.

మోడీపై చంద్రబాబు ప్రశంసల జల్లు

నరేంద్ర మోడీ నాయకత్వంపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. భారత్‌కు సరైన సమయంలో సరైన నాయకుడు దొరికారని, ఆయన మోడీని ఆకాశానికెత్తేశారు. నరేంద్ర మోడీకి విజన్, ఉత్సాహం ఉన్నాయని, పరిపూర్ణ కార్యదక్షత కలిగిన నాయకుడని అన్నారు. ప్రస్తుతం భారత్‌కు చాలా మంచి అవకాశమని, ఇప్పుడు మిస్ అయితే ఎప్పటికీ నష్టపోతామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏం సాధించాలన్నా ఒక విజన్ ఉండాలని, మోడీ విజన్ ఉన్న నాయకుడని చంద్రబాబు ప్రసంశలతో ముంచెత్తారు.

దేశానికి మోడీ ఓ స్ఫూర్తి: పవన్ కళ్యాణ్

ఎన్డీయే పార్లమెంటరీ సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దేశానికి మోడీ ఒక స్ఫూర్తి అని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే ఆంధ్రప్రదేశ్‌లో అద్భుత విజయం సాధించామన్నారు. మోడీ వెనుక తామంతా ఉన్నామని ప్రకటించారు.

తీరం... ప్రమాదకరం

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో ఐదేళ్ల క్రితం జియో ట్యూబ్ పూర్తిగా ధ్వంసమైంది. బండరాళ్లన్నీ సముద్రంలో కలిసిపోయాయి. తుపాను, అల్పపీడనం సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారి తీరప్రాంతం కోతకు గురవడం సర్వసాధారణమైంది. పేతాయ్, తిత్లీ, ఫణి, హెలిన్ తుపానుల సమయంలో ఉప్పాడ, కోనపాపపేట, సూరాడపేట తదితర గ్రామాల్లో వందలాది ఇల్లు నేలమట్టమయ్యాయి. గడిచిన 52 ఏళ్లలో కిలోమీటరు కంటే ఎక్కువగా తీరప్రాంతం ముందుకు చొచ్చుకు వచ్చింది. దాదాపు 15 వందల ఇళ్లు, దేవాలయాలు, ప్రభుత్వ భవనాలు పూర్తిగా సముద్రంలో కలిసిపోయాయని, 500 ఎకరాల పైబడి వ్యవసాయ భూమిని పూర్తిగా సముద్రంలో కలిసిపోయిందని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు.

బీచ్ రోడ్డు రక్షణకు ముప్పు

కాకినాడ నుంచి ఉప్పాడ వరకు సుమారు 15 కిలోమీటర్ల పొడవునా బీచ్ రోడ్డు ఉంది. రామయ్యపట్నం నుంచి కాకినాడ వైపు బీచ్ రోడ్డు గుండా సుమారు కిలోమీటరు పొడవున సముద్రకోత నివారణకు గతంలో అనేకసార్లు పెద్ద బండరాళ్లను, సుమారు రెండు వేల సిమెంటు దిమ్మలు డంప్ చేశారు. అయినా కోతను నివారించలేకపోయారు. మరమ్మతులకు ఏటా రూ.కోట్లలో ఖర్చు పెడుతున్నా నిరుపయోగమవుతోంది.

భయం భయంగా గడుపుతున్నాం



కొన్నేళ్లుగా సముద్రపు కోత తీవ్రంగా పెరిగింది. తుపానుల సమయంలో తీర ప్రాంతంలో ఉన్న ఇళ్లు సముద్రంలో కలిసి పోతున్నాయి. ప్రాణాలను గుప్పిట పెట్టుకుని భయంగా జీవించాల్సి వస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా తీరప్రాంత రక్షణకు చర్యలు తీసుకోవాలి.

– కారే సత్తిబాబు, మత్స్యకారుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం

కొత్త ప్రభుత్వంపై ఆశలు



జియో ట్యూబ్ టెక్నాలజీ పూర్తిగా ధ్వంస మైంది. సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలకు మొర పెట్టుకుంటున్నా పరిష్కారం చూపడం లేదు. వైసిపి, టిడిపి, జనసేన నాయకులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చాం. తీరప్రాంత రక్షణకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ ఇటీవల ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– పిక్కి చిన్న, మత్స్యకారుడు, ఉప్పాడ

సిఇఒ, సిఎస్‌కు అభినందనలు

- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాకు, నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఎపి జెఎసి అమరావతి అభినందనలు తెలిపింది. ఈ మేరకు ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ జనరల్ సెక్రటరీలు వలిశెట్టి దామోదరరావు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రమేష్‌కుమార్ శుక్రవారం వారిని కలిసి అభినందనలు తెలిపారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి

ప్రజాశక్తి- డెంకాడ (విజయనగరం జిల్లా)

తేనెటీగల దాడిలో ఓ రైతు మృతి చెందిన సంఘటన విజయనగరం జిల్లా డెంకాడలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... డెంకాడ గ్రామానికి చెందిన రొంగలి కృష్ణ (63) పశువులకు మేత వేయడానికి గురువారం ఉదయం తమ కళ్లానికి వెళ్లారు. అక్కడ ఆయనపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో కృష్ణ స్పృహ కోల్పోయారు. అటుగా వెళ్తున్న గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు భోగాపురం సిహెచ్‌ఎన్‌సికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విజయనగరం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి కార్యకర్తల రక్షణకు జిల్లా కమిటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం చెందాక రాష్ట్రవ్యాప్తంగా వైసిపి కార్యకర్తలపై టిడిపి దాడులకు పాల్పడుతోందని, వాటిని అడ్డుకుని కార్యకర్తలకు రక్షణ కల్పించేందుకు జిల్లా స్థాయి కమిటీలు వేసినట్లు వైసిపి తెలిపింది. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇటీవల ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులతోపాటు మాజీ ఎమ్మెల్యేలు శుక్రవారం కలిశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు, రాయలసీమ జిల్లాలకు చెందిన పలువురు నాయకులు కలిశారు. టిడిపి దాడులను నిలువరించి కార్యకర్తలకు అండగా వుండేందుకు ప్రతి జిల్లా స్థాయిలో కమిటీలను వేయాలని జగన్ ఆదేశించారు. ఈ కమిటీల్లో ఇటీవల గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపిలతోపాటు ఎమ్మెల్సీలు, న్యాయవాదులు వుండాలని సూచించారు. దాడులకు గురైన వారిని పరామర్శించి వారికి అండగా నిలవాలని, జిల్లా ఎస్‌పిలను కలిసి ఫిర్యాదు చేయాలని కోరారు.

కృష్ణా డెల్టా సాగుకు నీరేది?

- గోదావరిలో 14 అడుగులకూ చేరని ప్రవాహం
- ఖాళీ అయిన 'పులిచింతల'
- ఆందోళనలో రైతులు



గుర్రపు డెక్కతో నిండిన దోసపాడు కాల్వ

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కృష్ణా డెల్టాలో పంటల సాగుకు నీటి విడుదలపై ఇంకా స్పష్టత రాలేదు. గతేడాది జూన్ ఏడో తేదీనే ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఇప్పటికీ ప్రణాళికలు రూపొందించలేదు. మరోపక్క ఎగువ ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సాగునీటి విడుదలలో తీవ్ర జాప్యం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. కాల్వలు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కనీస నిర్వహణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో, సాగునీరు, పంటల సాగులో సమస్యలు ఎదురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో కృష్ణా జిల్లాలో 4,27,294 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా 4,10,825 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. నీటి లభ్యత ఆసరాగా కాలువల ఎగువ ప్రాంతాల్లో జూన్‌లోనూ, శివారు ప్రాంతాల్లో జులైలోనూ వరి నారు మళ్లు వేస్తారు. ప్రకాశం బ్యారేజీ నుండి కాలువల ద్వారా నీరు విడుదల చేసిన తర్వాతే అత్యధిక విస్తీర్ణంలో వరి సాగుకు సన్నద్ధమవుతారు. నారుమళ్లు వేస్తారు. వరి మాగాణుల్లో రెండో పంటగా రబీలో అపరాలు సాగు చేస్తారు. మొదటి పంట సాగులో జాప్యం జరిగితే రెండో పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. నవంబర్ నెలాఖరులోపు అపరాల పంట సాగు మొదలైతేనే వాతావరణం సహకరించి దిగుబడులు వస్తాయి. ఈ నేపథ్యంలో జూన్, జులై, ఆగస్టుల్లో నాట్లు పూర్తి చేయడానికి రైతులు ప్రయత్నిస్తారు. ఈ ఏడాది నీటి విడుదలపై ఇరిగేషన్ అధికారులు ఇప్పటి వరకు ప్రణాళిక విడుదల చేయలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇరిగేషన్ ఎడ్వయిజరీ బోర్డు సమావేశం నిర్వహించి నీటి విడుదలపై నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముంది.

సాగు నీటి విడుదలలో తీవ్ర జాప్యం?

ప్రకాశం బ్యారేజీకి ఎగువ ఉన్న పులిచింతల ప్రాజెక్టు నీరులేక బోసిపోతోంది. గోదావరి నదిలో 14 అడుగులకుపైబడి ప్రవాహం ఉంటేనే పట్టిసీమ ద్వారా నీటిని ప్రకాశం బ్యారేజీకి మళ్లించాలి. గోదావరిలో ప్రవాహం ఆ స్థాయిలో లేదు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో ఎగువన వర్షాలు కురిసి నీటి ప్రవాహం పెరిగిన తర్వాతే నదుల నుంచి నీటి విడుదల సాధ్యం అవుతుంది. దీంతో, ఈ ఏడాది డెల్టాకు నీటి విడుదలలో తీవ్ర జాప్యం జరిగే పరిస్థితి కనిపిస్తోంది.

కాలువలు, డ్రెయిన్ల నిర్వహణకు నిధులు కరువు

డెల్టాలోని కాల్వలు, డ్రెయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. నాలుగు రోజులు ఎండలు కాస్తే దిగువ ప్రాంతాలకు నీరు అందడం గగనమవుతోంది. రెండు రోజులు వర్షం కురిస్తే డ్రెయిన్లలో నీరు కదలక ఎగదన్ని పంట పొలాలను ముంచెత్తుతుంది. ఈ నేపథ్యంలో వీటి నిర్వహణకు ఈ ఏడాది రూ.53 కోట్లు అవసరం అవుతాయని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (సిఎడిఎ)కు ఇరిగేషన్ అధికారులు నివేదికలు పంపారు. నీటి శిస్తు ద్వారా సమకూరిన నిధులను మాత్రమే వీటి నిర్వహణకు సిఎడిఎ కేటాయిస్తోంది. ఈ ఏడాది ఎన్నికల్లో మునిగిపోవడంతో చాలా గ్రామాల్లో నీటి శిస్తు చెల్లింపులకు సంబంధించి ఆన్‌లైన్ సైట్‌ను అప్‌డేట్ చేయలేదు. నామమాత్రంగానే వసూళ్లు జరిగాయి. దీంతో, కనీస నిర్వహణకు ఈ ఏడాది నిధులు విడుదలయ్యే పరిస్థితి కనిపించడం లేదు.



సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

'సిపిఎఫ్'ని తెరిపించాల్సిందే..

- ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - గణపవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం సరిపల్లిలోని సిపిఎఫ్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని కార్మికులు ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సిపిఎఫ్ ప్రయివేట్ లిమిటెడ్ చేపలు, రొయ్యల మేత తయారీ ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందంటూ థాయిలాండ్‌కు చెందిన యాజమాన్యం ఫ్యాక్టరీ గేటుకు తాళాలు వేసి ఇటీవల కార్మికులను తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో 71 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. కనీసం ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఫ్యాక్టరీ మూసివేసి తమను తొలగించడం దారుణమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫ్యాక్టరీ తెరిపించి తమకు జీవనోపాధి చూపాలని జిల్లా కార్మిక శాఖాధికారులను కోరారు. ఇప్పటి వరకు తమకు ఎటువంటి నష్టపరిహారమూ అందజేయలేదని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సిఐటియు ఆధ్వర్యాన పోరాడతామని కార్మికులు స్పష్టం చేశారు. ఆందోళనలో కార్మికులు డి.సాయికృష్ణ, జి.శ్రీనివాసరాజు, ఎస్.ఏసుబాబు, యాసారపు రామకృష్ణ, డి.రాధాకృష్ణ, బి.రాంబాబు, ఎస్.రమణ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

సమస్యలు పరిష్క రించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఏ క్షణమైనా నిరధిక సమ్మెకు వెళ్తామని పార్వతీపురం మన్యం జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కమిటీ నాయకులు హెచ్చరించారు. సాలూరు మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజుకు శుక్రవారం వారు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు టి శంకరరావు, రాముడు మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా కార్మికుల సమస్యల పట్ల మున్సిపల్ కమిషనర్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అనివార్య పరిస్థితుల్లో సమ్మెకు దిగుతామని చెప్పారు. 2024 జనవరి నెలలో పండుగ ఖర్చులకు ప్రభుత్వం విడుదల చేసిన వెయ్యి రూపాయలు, అదే నెలలో వేతనం బకాయి రూ.మూడు వేలు, ఫిబ్రవరి వేతన బకాయి రూ. ఆరు వేలు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని చెప్పారు. డ్రైవర్లకు రూ.24,500 పెంచిన వేతనమూ అమలు చేయలేదని తెలిపారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని కౌన్సిల్‌లో చేసిన తీర్మానాన్ని సైతం అమలు చేయలేదని అన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌ను కోరితే ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు.

మహిళలకు ఉచిత ప్రయాణం కోసం కొత్త బస్సులను కొనుగోలు చేయాలి

- పిటిడి ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్తగా ఏర్పడబోయే టిడిపి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఎపి పిటిడి ఎంప్లాయీస్ యూనియన్ తెలిపింది. ఈ ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేసేందుకు ఆర్‌టిసిలో ప్రస్తుతమున్న బస్సులు ఏమాత్రం సరిపోవని, ప్రయాణికులకు తగ్గట్టు కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరింది. ఈ మేరకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య.. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరికి శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలో ఇటీవల అక్రమ రవాణా పెరిగిపోయిందని, దానిని నియంత్రించి ఆర్‌టిసిని లాభాల బాట పట్టించేందుకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఆర్‌టిసిని ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎపి పిటిడి బిసి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌పి శేషగిరిరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

శ్రీశ్రీ కుమారుడు వెంకటరమణ కన్నుమూత

అమెరికాలో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - గుంటూరు



శ్రీరంగం వెంకటరమణ (ఫైల్)

మహాకవి శ్రీశ్రీ కుమారుడు శ్రీరంగం వెంకట రమణ (59) అనారోగ్య కారణాలతో గురువారం అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఈ విషయాన్ని గుంటూరులోని వారి బంధువు డాక్టర్ రమణ యశస్వి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరంగం వెంకటరమణకి భార్య మాధవి, కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె కవిత ఉన్నారు. ఆయన భార్యది పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గణపవరం గ్రామం. శుక్రవారం సాయంత్రం అమెరికాలో వెంకట రమణ అంత్యక్రియలు పూర్తి అయినట్లు డాక్టర్ రమణా యశస్వి తెలిపారు. పాతికేళ్ల క్రితం శ్రీరంగం వెంకటరమణ ఆమెరికా వెళ్లారు. అక్కడే ఫైజర్ కంపెనీ పరిశోధనా విభాగంలో పనిచేశారు. మహాకవి శ్రీశ్రీ భార్య సరోజా శ్రీశ్రీ 80 సంవత్సరాల వయస్సులో కుమారుడిని కోల్పోయారని, ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు సాహితీ వేత్తలు సానుభూతి తెలిపారు. రమణ మృతికి సంతాపం తెలిపిన వారిలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జివి పూర్ణచంద్, సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ, అభ్యుదయ రచయితల సంఘం(అరసం), శ్రీశ్రీ సాహిత్యనిధి సభ్యులు ఉన్నారు.

కొడాలి, వంశీ ఇళ్లపై రాళ్ల దాడి

- విజయవాడ, గుడివాడల్లో ఉద్రిక్తత



విజయవాడలో వంశీ నివాసం ఉంటున్న అపార్టుమెంట్‌పై టిడిపి కార్యకర్తల రాళ్ల దాడిలో ధ్వంసమైన కార్లు



గుడివాడలోని కొడాలి నాని ఇంటి వద్ద టిడిపి కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - గుడివాడ, గన్నవరం

మాజీ మంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇళ్లపై శుక్రవారం టిడిపి కార్యకర్తలు దాడులకు దిగారు. దీంతో విజయవాడ, కృష్ణాజిల్లా గుడివాడల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. విజయవాడలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఇంటిపై యార్లగడ్డ అనుచరులు దాడి చేశారు. వంశీ నివాసం ఉంటున్న విజయవాడ పాలీక్లీనిక్ రోడ్డులోని అపార్ట్‌మెంట్ వద్ద వీరంగం సృష్టించారు. గన్నవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన యార్లగడ్డ వెంకట్రావు అనుచరులు సుమారు 20 మంది నాలుగు కార్లలో ఆ అపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లారు. వంశీ ఉంటున్న నాలుగో ఫ్లోర్‌వైపు రాళ్లు విసిరారు. ఈ దాడిలో కింద పార్కింగ్‌లో ఉన్న వంశీకి చెందిన రెండు కార్లు ధ్వంసమయ్యాయి. అనంతరం అపార్ట్‌మెంట్‌ను నలువైపులా చుట్టుముట్టి... వాహనాల్లో తిరుగుతూ హల్‌చల్ చేశారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసి అందరినీ చెదరగొట్టారు. ఇంకా అక్కడ ఉద్రిక్తత కొనసాగుతూనే ఉంది. పోలీసులను పెద్దఎత్తున మొహరించారు. దాడి సమయంలో ఇంట్లో వంశీతోపాటు ఆయన అనుచరులు ఓలుపల్లి రంగా, కాట్రు శేషు, రాము, నాని ఉన్నారు.

విజయవాడ రూరల్ మండలం నున్న ప్రాంతానికి చెందిన వైసిపి నాయకులు వంశీని అపార్ట్‌మెంట్‌లో కలిసి వెళ్లిన తర్వాత ఈ ఘటన జరిగింది. అలాగే, తెలుగు యువతకు చెందిన కొందరు నాయకులు గుడివాడలోని కొడాలి నాని ఇంటిపైకి రాళ్లు, గుడ్లతో దాడి చేశారు. ఆపై ఇంటి బయట రోడ్డుపై టపాసులు కాల్చి నానా హంగామా సృష్టించారు. ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. టిడిపి కార్యకర్తలను అక్కడి నుంచి పంపే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో పోలీసులతో టిడిపి కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. విజయవాడ రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న వైసిపి నాయకులు పెద్దిరెడ్డి శివారెడ్డి ఇంటిపై గురువారం అర్ధరాత్రి టిడిపి కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఆయన కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇంటి బయట ఉన్న ఫర్నీచర్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆపై శివారెడ్డిని చంపేస్తామంటూ బెదిరిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన స్థానికులు భయంతో వణికిపోయారు. ఈ దాడిపై పెద్దిరెడ్డి శివారెడ్డి నున్న పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అనంతపురం, కర్నూలులో భారీ వర్షం

- పిడుగుపాటుకు ఇద్దరు మృతి
- ఉప్పొంగిన వాగులు, వంకలు



కర్నూలు జిల్లా తుగ్గలి - మామిళ్లకుంట మధ్య తెగిపోయిన రహదారి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. ప్రకాశం జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 77.6, కర్నూలు జిల్లా తుగ్గలిలో 56.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి రహదారులు జలపాతాన్ని తలపించాయి. పలు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు.

వర్షానికి కర్నూలు జిల్లా తుగ్గలి చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. మామిళ్లకుంట రోడ్డు తెగిపోవడంతో తుగ్గలి- మామిళ్లకుంటకు రాకపోకలు నిలిచిపోయాయి. మామిళ్ల కుంట గ్రామస్తులు చుట్టూ తిరిగి పత్తికొండ, ఎద్దులదొడ్డి, కోతి కొండమీదుగా చేరుకుంటున్నారు. హాలహర్వి మండలంలోని ఎస్‌సి కాలనీ పక్కన పెద్దవాగు పొంగి పొర్లడంతో పలు ఇళ్లలోని వరద నీరు వచ్చి చేరింది. నంద్యాల జిల్లా పాములపాడు మండలంలో ఇస్కాల గ్రామ సమీపంలో ఉన్న బనవాసి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలంలోని తురకల పట్నం నుంచి సానిపల్లికి వెళ్లే రహదారిలో వంకలు భారీగా ప్రవహిస్తున్నాయి. బత్తలపల్లి మండలంలో చిన్న కుంటలు, చెక్ డ్యాముల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. డి. చెర్లోపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాదెండ్ల రవీంద్రబాబు (30) తన పశువుల కోసం పొలం నుంచి మేత తీసుకువస్తుండగా ఆయనకు సమీపంలో పిడుగుపడింది. దీంతో రవీంద్రబాబు అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. రవీంద్రబాబుకు భార్య కళావతి, కుమార్తె ప్రభావతి ఉన్నారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం చలంకూరు గ్రామానికి చెందిన గంధం థామస్ (55) ఇంటి ముందున్న చెట్టుపై పిడుగుపడింది. ఆ సమయంలో చెట్టు కింద కూర్చున్న థామస్ అక్కడికక్కడే మరణించారు. మూడు గేదెలు మృత్యువాతపడ్డాయి.

డయేరియా విస్తరించకుండా చర్యలు

వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో డయేరియా విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లాల డిఎంహెచ్‌ఒలను వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో చోటుచేసుకున్న డయేరియా సంఘటనలు మరే ఇతర నగరాల్లోనూ పునరావృతం కాకూడదని ఆయన పేర్కొన్నారు. మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం డిఎంహెచ్‌ఒలు, జిల్లాల మలేరియా ఆఫీసర్స్ (డిఎంఒ)లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు, విజయవాడ నగరాల్లో డయేరియా ప్రబలడంలో సిఎంహెచ్‌ఒల వైఫల్యం కనబడుతోందన్నారు. డిఎంహెచ్‌ఒలతో సిఎంహెచ్‌ఒలు సమన్వయం చేసుకుంటే ఇటువంటి పరిస్థితి ఎదురయ్యేది కాదన్నారు. డయేరియా విషయంలో మున్సిపల్ కమిషనర్లతో తాను స్వయంగా మాట్లాడుతానని వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో నీటి శ్యాంపిళ్ల పరీక్ష కోసం ఐపిఎమ్‌తో సమన్వయం చేసుకోవాలని, ఐపిఎమ్‌ల వద్ద ఉన్న నాలుగు మొబైల్ వాహనాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. అల్లూరి సీతారామరాజు, పల్నాడు, శ్రీకాకుళం జిల్లాల్లో నీటి శ్యాంపిల్స్‌ను పరీక్షించే విషయంతోపాటు, తిరుపతి, కర్నూలు, విశాఖ నగరాల్లో మలేరియా, డెంగీ కేసుల విషయంలో సిహెచ్‌ఒలు మరింత శ్రద్ధ కనబరచాలన్నారు.

యుపిహెచ్‌సిల (అర్బన్ పబ్లిక్ సెంటర్స్) వారీ కేసుల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. కీటక జనిత వ్యాధులపై భవిష్యత్తులో తీసుకోబోయే చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర స్థాయి అధికారులను కమిషనరు ఆదేశించారు. దోమల నివారణ విషయంలో ఏమాత్రం అశ్రద్ధ వహించొద్దని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గిరిజన సంక్షేమ స్కూళ్లు, హాస్టల్స్‌పై దృష్టి సారించాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్‌పై దృష్టిపెట్టాలన్నారు. ఈ సమీక్షలో ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ పద్మావతి, అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, ఎన్‌హెచ్‌ఎమ్ స్టేట్ ప్రోగ్రామ్ మేనేజరు దుంపల వెంకట రవికిరణ్ పాల్గొన్నారు.

సెన్సెక్స్‌కు 1600 పాయింట్ల లాభం

ముంబయి : వరుసగా మూడో రోజూ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 1619 పాయింట్ల లాభంతో 76,693కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 469 పాయింట్ల లాభంతో 23,290 వద్ద ముగిసింది. సెన్సెక్స్- 30లో మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టాటా స్టీల్ షేర్లు అధికంగా లాభపడిన వాటలో ఉన్నాయి.

పాట్ కమిన్స్ న్యూబ్యాలెన్స్ స్టోర్ సందర్శన

హైదరాబాద్ : ప్రముఖ క్రికెటర్ పాట్ కమిన్స్ హైదరాబాద్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లోని న్యూ బ్యాలెన్స్ స్టోర్‌ను సందర్శించారు. స్పోర్ట్స్ బ్రాండ్‌లలో ఒకటైన న్యూ బ్యాలెన్స్ బ్రాండ్ పట్ల తన కతజ్ఞతలు తెలిపారు.

వైసిపికి రావెల కిశోర్‌బాబు రాజీనామా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు వైసిపికి శుక్రవారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో నాలుగు దశాబ్దాలుగా మందకృష్ణ నాయకత్వంలో జరుగుతున్న ఎస్‌సి వర్గీకరణ పోరాటం తుది దశకు వచ్చిందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలంగా వున్నందున వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ వెంట నడవనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్తానన్నారు.

నీటి సంరక్షణపై స్మార్టర్ హోమ్స్ ప్రచారం

హైదరాబాద్ : నీటి కొరత, పరిరక్షణ గురించి అవగాహన క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు స్మార్ట్ వాటర్ మీటరింగ్ సొల్యూషన్స్ సంస్థ స్మార్టర్ హోమ్స్ తెలిపింది. నీటి సంరక్షణ ఆవశ్యకతను తెలుపుతూ "సమ్మర్ ఆఫ్ సస్టైనబిలిటీ 2024 -వాటర్ వైజ్ కమ్యూనిటీస్" ప్రారంభిస్తున్నట్లు స్మార్టర్ హోమ్స్ సిఇఒ జితేందర్ తిర్వాణి పేర్కొన్నారు. ఈ ప్రచారం ద్వారా నీటి సంరక్షణ పట్ల సమాజ ప్రమేయం, సామూహిక బాధ్యత భావాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వాణిజ్య వాహన అమ్మకాల్లో 7% పతనం

- ఇక్రా అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో వాణిజ్య వాహన రంగం అమ్మకాల్లో 4-7 శాతం పతనం చోటు చేసుకోవచ్చని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా అంచనా వేసింది. గడిచిన 2023-24లో టోకు అమ్మకాల్లో 1 శాతం, రిటైల్ విక్రయాల్లో పెరుగుదల ఉందని తెలిపింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మౌలిక వసతుల రంగం కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో చివరి త్రైమాసికం అమ్మకాల్లో 4 శాతం తగ్గుదల చోటు చేసుకుందని పేర్కొంది. ఈ ఏడాది తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు ఏకంగా 5-8 శాతం తగ్గొచ్చని విశ్లేషించింది. మౌలిక వసతుల రంగంలో నెలకొన్న పలు సవాళ్లు వాహన రంగంపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని ఇక్రా పేర్కొంది.

శాకాహారం 9 శాతం ప్రియం

- క్రిసిల్ రిపోర్ట్



న్యూఢిల్లీ: శాకాహారం భోజనం మరింత ఖరీదు అయ్యింది. ఉల్లి, టమోటా, బంగాళ దుంపల రేట్లు పెరిగిపోవడం వల్ల గడిచిన ఏప్రిల్‌లో శాఖహార భోజనం ప్లేట్ 'వెజ్ థాలీ' వ్యయం 9 శాతం పెరిగిందని క్రిసిల్ ఎంఅండ్ఎ రీసెర్చ్ వెల్లడించింది. మరోవైపు చికెన్ రేట్లు తగ్గడం వల్ల మాంసహార ప్లేట్ ధర దిగివచ్చిందని పేర్కొంది. గతేడాది మేలో మాంసహార థాలీ ధర రూ.59.9గా ఉండగా.. గడిచిన నెలలో రూ.55.9కి తగ్గింది. బ్రాయిలర్ చికెన్ ధరలు 16 శాతం క్షీణించడంతో నాన్ వెజ్ థాలీ ధర తగ్గినట్లు నివేదిక తెలిపింది. క్రిసిల్ రిపోర్ట్ ప్రకారం.. రోటీ, కూరగాయలు, అన్నం, పప్పు, పెరుగు, సలాడ్‌లతో కూడిన వెజ్ థాలీ ధర మే నెలలో నెలలో రూ.27.80కి పెరిగింది. గతేడాది ఇదే నెలలో పెరిగిన రూ.25.5తో పోలిస్తే ఎక్కువ. గడిచిన మే నెలలో టమాటా ధరలు 39 శాతం, బంగాళదుంపలు 41 శాతం, ఉల్లి ధరలు 43 శాతం పెరగడమే వెజ్‌థాలీ ధర పెరగుదలకు కారణం.

బియ్యం, పప్పుల ధరలు కూడా వరుసగా 13 శాతం, 21 శాతం చొప్పున ఎగిశాయి. జీలకర్ర, మిర్చి, కూరగాయల నూనె ధరలు వరుసగా 37 శాతం, 25 శాతం, 8 శాతం తగ్గడం కొంత ఉపశమనం కలిగిందని నివేదిక పేర్కొంది.



ఎల్లప్పగుంటకు ఎసరు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంకు సంబంధించిన ఆస్తులను కాపాడడంలో అటు అధికారులు, ఇటు ధర్మకర్తల మండలి పూర్తిగా విఫలమైంది. ఆస్తులు ఒక్కొక్కటిగా అన్యాక్రాంతం అవుతున్నా ఎవరూ స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా గిరి ప్రదక్షిణం మార్గంలోని ఎల్లప్ప గుంటను కొందరు ఆక్రమిస్తున్నారు. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు రెవెన్యూకు సంబంధించిన ఎల్లప్పగుంటను, దానికి సమీపంలోని భూమిని చదును చేసే పనిలో పడ్డారు ఆక్రమదారులు. ఆలయ ఆస్తులను కాపాడాల్సిన ఒక ధర్మకర్త తన డ్రైవర్ పేరుతో ఆక్రమణకు దిగినట్లు సమాచారం. ఇందుకు కొందరు సిబ్బంది కూడా సహకరిస్తున్నారని అంటున్నారు. రూ.16 కోట్ల రూపాయలతో గిరి ప్రదక్షిణ సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగింది. దీంతో ఈ ప్రాంతంలో భూమి విలువ బాగా పెరిగింది. ఇదే అదనుగా గుంటను, సమీపంలోని భూమిని ఆక్రమించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సమీపంలోనే గుగ్గిళ్లవ్వ విగ్రహం, అతిథి మండపం ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా పరిశీలించి చర్యలు తీసుకొని విలువైన స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు యాత్రికులు అన్నారు.

'భీమసింగి'ని తెరిపిస్తారా..?

- గత ప్రభుత్వంలో చక్కెర పరిశ్రమ మూత
- తెరిపించాలని పోరాడిన రైతులపై ఉక్కుపాదం
- రైతు ఆగ్రహాన్ని చవిచూసిన వైసిపి
- ఫ్యాక్టరీ తెరిపించాలని ఆకాంక్ష



ప్రజాశక్తి - జామి (విజయనగరం జిల్లా)

భీమసింగి సహకార చక్కెర కర్మాగారం ప్రభుత్వ విధానాల ఫలితంగా మూతపడింది. ప్రధానంగా వైసిపి ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరిపించడం పట్ల చిత్తశుద్ధి చూపకపోగా, నెపాన్ని రైతులపైకి నెట్టింది. చెరకు సాగు సరిపడా లేకపోవడం వల్లే ఫ్యాక్టరీ నడవడం లేదని చెప్పుకొచ్చింది. మరోవైపు ఎర్ర జెండా ఆధ్వర్యంలో ఫ్యాక్టరీని తెరిపించాలని చేపట్టిన పోరాటంపైనా వైసిపి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు రావడం, ఈ ప్రాంత రైతులు, కార్మికులు, ప్రజల నుంచి వైసిపి తీవ్ర అగ్రహాన్ని చవిచూసింది. తాజాగా జిల్లాలో ఏడుకు ఏడు స్థానాల్లో వైసిపిని ఓడించి, కూటమికి ప్రజలు పట్టం కట్టిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఇకనైనా భీమసింగికి మంచి రోజులు వస్తాయని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

భీమసింగి చక్కెర ఫ్యాక్టరీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. రైతులు వాటా ధనాలతో నిర్మించుకున్న ఈ ఫ్యాక్టరీ మూసేయడం అంటే చరిత్రను చెరిపేయడమే. మరోవైపు ఏళ్లుగా ఫ్యాక్టరీని నమ్ముకుని ఉన్న కార్మికులు, ఉద్యోగులను రోడ్డు పడేయడమే. సహకార రంగాన్ని బలోపేతం చేస్తానని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన వైసిపి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లపాటు కమిటీల పేరుతోనే కాలయాపన చేసి, చివరికి ఫ్యాక్టరీని మూసేసింది. దీనిపై చెరకు రైతులు, కార్మికులు, ప్రజలు ఎంత మొరపెట్టుకున్నా. పట్టించుకో లేదు. గతంలో చంద్రబాబు అభివృద్ధి చేస్తామని చెప్పి, నిపుణుల కమిటీని వేసి, చేతులు దులుపుకున్నారు. చివరికి ప్రభుత్వం ఆ కమిటీ నివేదిక మాత్రం బహిర్గతం కాలేదు. మరోసారి ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వచ్చారు. ఈసారైనా సహకార చక్కెర ఫ్యాక్టరీలపై టిడిపి సానుకూల రీతిలో తెరిపించే చర్యలు చేపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ఆ దిశగా దృష్టిసారిస్తే..

వాస్తవానికి సహకార ఫ్యాక్టరీలన్నీ 70 శాతం క్రషింగులు కుప్పకూలిపోయాయి. జిల్లాలో భీమసింగి సహకార ఫ్యాక్టరీ ఒకప్పుడు 1.60 లక్షల టన్నులు క్రషింగ్ చేయగా, ప్రస్తుతం 30 వేల టన్నులు కూడా లభ్యం కాదని అధికారులు సెలవిస్తున్నారు. ఆధునికీకరణ చేస్తామన్న పేరుతో క్రషింగ్‌ను ఆపేసిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఫ్యాక్టరీని మూసేసింది. సహకార ఫ్యాక్టరీలను బాగు చేసేందుకు అనేక అవకాశాలున్నాయి. ప్రధానంగా సహకార ఫ్యాక్టరీలన్నీ పురాతనమైనవి కావడంతో ముందుగా యంత్రాలను ఆధునికీకరించాలి. తక్షణమే క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలి. తద్వారా బయో ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లు నెలకొల్పడం సాధ్యమవుతుంది. దీనికి సుమారుగా రూ.10 కోట్ల నుంచి 15 కోట్లు అవసరం ఉంటుందని గతంలో అంచనా. ఈ మూడింటిపై దృష్టి సారిస్తేనే మనుగడ సాధ్యం.

అప్పుడే రైతులకు మేలు

వ్యవసాయమే లాభసాటి కోల్పోతున్న నేపథ్యంలో ఏడాదికి గుత్తగా ఆదాయాన్ని సమకూర్చే చెరకు పంట బతకాలంటే, సహకార ఫ్యాక్టరీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో కొత్తగా కొలువు తీరబోయే మంత్రులతోపాటు ఏడుగురు ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీని నిలబెట్టేందుకు దృష్టిసారించాలి. అప్పుడే ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరుగుతుంది. ఆ దిశగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్వారీ మెట్టపై నుంచి జారిపడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

క్వారీ మెట్టపైనుంచి కార్మికుడు కాలుజారి పడటంతో పీకకు తాడు బిగుసుకొని మరణించాడు. ఈ సంఘటన శుక్రవారం విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని ధర్మవరం సమీపంలోని క్వారీ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ధర్మవరం గ్రామానికి చెందిన లోతేటి అప్పారావు (45) గ్రామ సమీపంలోని దయ్యాలమెట్ట ను ఆనుకొని ఉన్న మల్లేశ్వర స్వామి క్వారీలో పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా శుక్రవారం ఉదయం ఐదు గంటలకు మెట్టపై చేతితో రాయిని కొట్టి అమ్ముకునేందుకు పైభాగానికి చేరుకున్నాడు. ఆరు గంటల సమయంలో నడుముకు తాడు కట్టుకొని పని చేసుకుంటున్నాడు. ఇదే సమయంలో అకస్మాత్తుగా కాలు జారింది. దీంతో క్వారీ పైభాగం నుంచి కిందకు జారిపోయాడు. ఆ సమయంలో చేతితో పట్టుకున్న తాడు మెడకు చుట్టుకోవడంతో వెంటనే బిగుసుకొని అక్కడికక్కడే చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడకు చేరుకున్నారు. ఈ సంఘటనా స్థలానికి టిడిపి నాయకుడు లగుడు తిరుపతి, సర్పంచ్ సన్యాసయ్య, వైసిపి నాయకుడు అల్లు మహాలక్ష్మి నాయుడు తదితరులు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గోదావరి వాసుల తాగునీటి ఘోష..!

- కొత్త ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించేనా?
- ఆక్వా చెరువులతో తాగునీటి వనరులు ధ్వంసం
- కొనుగోలు చేస్తే తప్ప తీరని దాహం
- వాటర్‌గ్రిడ్ అంటూ గత ప్రభుత్వం ఐదేళ్లు కాలక్షేపం
- గంపగుత్తగా ఓట్లేసిన గోదావరి ప్రజల గోడు వినేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పరవళ్లు తొక్కే గోదావరిని ఆనుకుని ఉన్నా దాహం తీర్చుకునేందుకు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న జిల్లా ప్రజల ఘోష కొత్త ప్రభుత్వానికైనా విన్పించేనా అనే చర్చ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతోంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో టిడిపి కూటమి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 స్థానాలనూ గెలుచుకుంది. దీంతో జిల్లాలోని ప్రధానమైన తాగునీటి సమస్యను కొత్త ప్రభుత్వమైనా పరిష్కరించాలని అంతా కోరుతున్నారు. విచ్చలవిడిగా ఆక్వా చెరువుల తవ్వకాలు సాగించడంతో రెండు జిల్లాల్లోని తాగునీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. ఆక్వా చెరువుల్లో నీటిని పంట కాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. అదేనీటిని పంచాయతీ తాగునీటి ట్యాంకుల్లోకి నింపుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 40 లక్షల జనాభా ఉంది. ముఖ్యంగా డెల్టా పరిధిలోని 29 మండలాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డబ్బు పెట్టి కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి నెలకొంది. నెలకు కనీసంగా లెక్కించినా రూ.600కుపైగా తాగునీటి కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో జిల్లాలోని తాగునీటి సమస్యనే ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా సాగింది. అయితే సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఏ గ్రామం వెళ్లి పరిశీలించినా పంచాయతీ ట్యాంకుల నుంచి విడుదల చేస్తున్న నీరు తాగడానికి పనికిరాని పరిస్థితి. పసర్లు కమ్మి అధ్వానంగా ఉంటున్నాయి. 2019 ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ ద్వారా గోదావరి నుంచి పైపులైన్ వేసి ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తామని వైసిపి ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో హడావుడి చేసింది. వాటర్‌గ్రిడ్‌కు రూ.3,200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. తర్వాత వాటర్‌గ్రిడ్ పథకాన్ని డెల్టాకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించి రూ.1400 కోట్లకు బడ్జెట్‌ను కుదించింది. అయినప్పటికీ ఐదేళ్ల పదవీకాలంలో వాటర్‌గ్రిడ్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో జిల్లాలోని తాగునీటి సమస్య ఇప్పటికీ అలానే ఉండిపోయింది. ఎన్నికల ముందు ప్రతి పార్టీ తాగునీటిపై హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా వదిలేయడం పరిపాటిగా మారిపోయింది. జిల్లాప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధానమైన తాగునీటి సమస్యను కూడా పాలకులు పట్టించుకోకపోవడం ఇక్కడి ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది. వైసిపి ఓటమిలో ఈ అంశం కూడా ప్రధానమైందని చెప్పొచ్చు.

కలుషిత నీటితో అనారోగ్యం పాలు

జిల్లాలో అత్యధికంగా దిగువ మధ్యతరగతి ప్రజానీకం ఉన్నారు. ఏరోజు పనికి వెళ్తే ఆ రోజే కడుపు నిండే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ప్రతిరోజూ రూ.30 వెచ్చించి తాగునీరు కొనుగోలు చేయలేక కలుషిత నీటినే తాగుతున్నారు. దీంతో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో కిడ్నీ సమస్యలు, కేన్సర్ వంటి రోగాలు ఎక్కువగా రావడానికి కలుషిత తాగునీరే కారణమనే చర్చ నడుస్తోంది. ఇంకా అనేక రోగాలు జిల్లా ప్రజలను చుట్టుముడుతున్న పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వమైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

విధ్వంసం, విద్వేషం సరికాదు

- ప్రమాణ స్వీకారం చేయలేదు అప్పుడే కక్షసాధింపులు, బెదిరింపులు
- ప్రజలు అవకాశమిచ్చారు... అభివృద్ధి చేయండి
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

ఉద్దాన ప్రజల ఆరోగ్య ప్రదాయని అయిన వైఎస్ఆర్ కిడ్నీ ఆస్పత్రి శిలాఫలకం, వైఎస్ఆర్ ఫొటోతో ఉన్న బోర్డును టిడిపి నాయకులు ధ్వంసం చేయడం సరికాదని మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని ప్రగతి భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ రోగుల కోసం సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రికి ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయడమే కాక పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. ఆ ఆస్పత్రిలో వైద్యుల్లేరని, సౌకర్యాల్లేవని టిడిపి నాయకులు దుష్ప్రచారం చేశారని చెప్పారు. అన్నీ ఉన్నాయో, లేదో వెళ్లి పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ పైశాచికానందం పొందడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో గెలిచి మూడు రోజులైంది, ఇంకా ప్రమాణ స్వీకారమే కాలేదని అప్పుడే టిడిపి నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శిరీషకు ప్రజలు ఒక మంచి అవకాశం ఇచ్చారని దాన్ని ఆమె సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తూ పలాస అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఆడపిల్లను వేధిస్తున్నానని ఆరోపణలు చేశారని చెప్పారు. గత ఐదేళ్లలో తనపై అసత్య ఆరోపణలు చేశారని, వ్యక్తిగత దూషణలు చేసినా తట్టుకుని వచ్చానన్నారు. తనపై ఐదు కేసులున్నాయని, ఈ ఐదేళ్లలో శిరీషపై ఒక్క ఎఫ్ఐఆర్ అయినా నమోదైందా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో ఏదైనా తప్పు జరిగి ఉంటే తమపై కక్షసాధించాలని, కార్యకర్తలపై దాడులు, విధ్వంసాలు సరికాదన్నారు. రాష్ట్రంలో ఊహించని రీతిలో వైసిపి ఓటమిపాలైందని, తమలో లోపాలు ఉండి ఉండవచ్చని వాటిని సరిచేసుకుంటామన్నారు. తనకు ఓట్లు వేసిన ప్రజలకు, తన విజయం కోసం కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు.

39 కేజీల గంజాయి ధ్వంసం

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్: నంద్యాల జిల్లాలో నాలుగు సబ్ డివిజన్ లలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పట్టుబడిన 39.223 కిలోల గంజాయిని శుక్రవారం అయ్యలూరి మెట్టకు సమీపంలో గల విజయపాల డైరీ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో పోలీసులు ధ్వంసం చేశారు. పట్టుబడిన గంజాయి 39.223 కేజీలని, విలువ సుమారు రూ.4,70,676 ఉంటుందని పోలీసుల అంచనా వేశారు. గంజాయి దగ్ధం చేసిన వారిలో డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ జయరాములు, ఎస్ఐ జి . రామనాద్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెనడా సంచలనం

- ఐర్లాండ్‌పై 12 పరుగుల తేడాతో గెలుపు
- బ్యాటింగ్‌లో మెరిసిన కిర్టన్, మొవ్వ



న్యూయార్క్: ఐసిసి టి20 ప్రపంచ కప్‌లో కెనడా సంచలనం సృష్టించింది. టి20 ప్రపంచకప్‌కు అర్హత సాధించడమే గొప్ప అనుకుంటే.. ప్రధాన టోర్నీలో ఏకంగా ఐర్లాండ్‌ను ఓడించింది. నసావు కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో కెనడా జట్టు 12 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. లో స్కోరింగ్ గేమ్‌లో తొలుత ఐర్లాండ్ బౌలర్ల ధాటికి టాపార్డర్ విఫలమైనా.. నికోలస్ కిర్టన్(49), వికెట్ కీపర్ శ్రేయాస్ మొవ్వ(37)లు ఉతికేశారు. ఐర్లాండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించారు. దీంతో కెనడా 7 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. ఐర్లాండ్ బౌలర్లలో మెక్‌కార్తీ, యంగ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. కెనడా ఓపెనర్లు నవ్‌నీత్ ధలివల్(6), అరోన్ జాన్సన్(14)లు స్వల్ప స్కోర్‌కే ఔటయ్యారు. యంగ్, డెలానీ విజంభణతో పర్గాత్ సింగ్(18), దిల్‌ప్రీత్ బజ్వా(7)లు డగౌట్ చేరారు. పది ఓవర్లలోపే 53 పరుగులకే వికెట్లు పడిన జట్టును శ్రేయాస్ మొవ్వ(37), నికోలస్ కిర్‌స్టన్(49)లు ఆదుకున్నారు. చకచకా సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోర్ బోర్డును కదిలించారు. కాస్త కుదురుకున్నాక ఇద్దరూ బౌండరీలతో చెలరేగారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 75 జత చేయడంతో కెనడా పోరాడగలిగే స్కోర్ చేసింది.

అనంతరం కెనడా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. టాపార్డర్ బ్యాటర్లు విఫలమవ్వడంతో ఆ జట్టు 59పరుగులకే 6వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత డోక్రెల్(30నాటౌట్), అడైర్(34) రాణించినా.. మ్యాచ్‌ను గెలిపించలేకపోయారు. దీంతో ఐర్లాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 7వికెట్లు కోల్పోయి 125పరుగులే చేసింది. కెనడా బౌలర్లు జోర్డాన్, హైగర్‌కు రెండేసి, జొనార్డ్, సాద్ బిన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నికోలస్ కిర్టన్‌కు లభించింది.

స్కోరుబోర్డు (సంక్షిప్తంగా..)

కెనడా : 137/7(20ఓవర్లలో)
నికోలస్ కిర్టన్ 49, మొవ్వ 37; కర్టీ(2/24), యంగ్(2/32)
ఐర్లాండ్ : 125/7(20 ఓవర్లలో)
అడైర్ 34, డాక్రెల్(30నాటౌట్); గోర్డన్(2/16), హైలిజైర్ (2/18)

టాస్ లేకుండానే దేశవాళీ క్రికెట్

- సికె నాయుడు టోర్నీనుంచి అమలు
- సెప్టెంబర్‌లో దులీప్ ట్రోఫీ
- షెడ్యూల్ విడుదల చేసిన బిసిసిఐ

ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) దేశవాళీ క్రికెట్ 2024-25 షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది నుంచి జరిగే దేశవాళీ సీజన్‌లో టాస్ వేయకుండానే మ్యాచ్‌లు జరగనున్నాయి. అదెలాగంటే.. టాస్ బదులు పర్యాటక జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్ ఎంచుకొనే అవకాశమిస్తారు. ఇది ఈ ఏడాది సికె నాయుడు ట్రోఫీ సరికొత్తగా ఉండనుంది. ఇక సెప్టెంబర్‌లో దులీప్ ట్రోఫీతో దేశవాళీ సీజన్ ఆరంభం కానుంది. అనంతపురం వేదికగా సెప్టెంబర్ 5న తొలి మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో పురుషుల సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన నాలుగు జట్లు పాల్గొననున్నాయి. అనంతరం వరుసగా ఇరానీ కప్, రంజీట్రోఫీలు నిర్వహించనున్నారు. అయితే.. ఈసారి రెండు విడతలుగా రంజీ పోటీలు జరిపేందుకు బిసిసిఐ నిర్ణయించింది. రెడ్ బాల్ క్రికెట్ టోర్నీలు పూర్తవ్వగానే వైట్ బాల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. తొలుత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ.. ఆ తర్వాత విజయ్ హజారే ట్రోఫీ ఉంటుంది. ఈ రెండు టోర్నీలు ముగిశాక రంజీట్రోఫీ రెండో విడతల్లో జరగనుంది. మ్యాచ్ ఏదైనా సరే టాస్ వేయడం పరిపాటి. కానీ, ఈసారి సీకే నాయుడు ట్రోఫీ సరికొత్త ఒరవడికి నాంది పలుకనుంది. ఈ టోర్నీలో ఇకపై టాస్ వేయకుండానే మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

వేసవి విడిది

తాత గారి ఊళ్లో ...




అందమైన ఒక చిన్న గ్రామంలో ఒక తాత, అమ్మమ్మ ఉన్నారు. ఈ వేసవి సెలవులకు వాళ్ల మనుమలు, మనుమరాళ్లు అంతా ఇంటికి వచ్చారు. పిల్లలందరినీ చూసి అవ్వా తాత ఎంతో మురిసిపోయారు.

ఒక రోజు తాత పిల్లలను మల్లె తోటలోకి తీసుకెళ్లాడు. ఆ తోటల్ని చూసి పిల్లలు భలే సంతోషపడ్డారు. 'మా పట్టణాల్లో ఎందుకు తాతయ్య ఇలాంటి తోటలు ఉండవు' అని అందరూ అడిగారు. 'మీ పట్టణంలో ఎవరూ వ్యవసాయం చేయరు. ఇక్కడ అందరూ ఇదే వృత్తిగా చేస్తారు' అని తాతయ్య చెప్పాడు. ఇంకోరోజు పిల్లలు తాతయ్యతో, 'తాతా మాకు మామిడికాయలు కావాలి, తెచ్చి పెట్టు' అన్నారు. 'సరే' అని తాతయ్య మామిడి కాయలతో పాటు తాటి ముంజెలు కూడా తెచ్చాడు. పిల్లలంతా తీయని మామిడి పళ్ళు, చల్లని తాటి ముంజలు తింటూ ఆ రోజంతా సరదాగా గడిపారు.

తాతయ్య ఊళ్లో ఉన్నన్ని రోజులూ పిల్లలంతా గ్రామమంతా తిరుగుతూ, ఆడుకుంటూ చింతకాయలు కోసుకోవడం, తినటం, రకరకాల పనులు చేస్తూ ఉన్నారు. తెలియని ఎన్నో విషయాలను తాతయ్యని అడిగి తెలుసుకున్నారు. సెలవులు గడిపిన తర్వాత ఊరు నుండి వెళ్లిపోతూ, 'మళ్లీ రాబోయే సెలవులకు వస్తామ'ని, తాతయ్య, అమ్మలకు చెప్పి సంతోషంగా పట్టణానికి బయల్దేరారు.



కాకర్ల గీతిక,
9వ తరగతి , అరవింద మోడల్ స్కూల్, మంగళగిరి.




వేసవిలో అల్లరి

అచ్చయ్య తోటలోకి
నెచ్చెలులతో వచ్చిరి
నచ్చిన కాయలు తినిరి!
ముచ్చట్లు చెప్పుకొనిరి
నచ్చినట్లుగా నడిచిరి
రెచ్చిపోయి పాడిరి
అచ్చమైన తెలుగు తిండ్లు ఆరగించిరి!

రచ్చలెరుగని అల్లర్లతో
ముచ్చటైన కబుర్లతో
వేసవిలో అల్లరి చేసిరి
అల్లరి పిల్లలు ఆడిపాడిరి!

– ఆళ్ల నాగేశ్వరరావు
(కమల శ్రీ), తెనాలి
74166 38823

బొమ్మరిల్లు




ధీరజ్ సాకరే,
6వ తరగతి,
ఆదోని, అక్షర శ్రీ స్కూల్,
కర్నూలు జిల్లా.





కె.నిర్వి,
6వతరగతి,
సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు,
పురుషోత్తపట్నం







ఎస్ మాధురి లక్ష్మి,
4వ తరగతి,
ఎ తిమ్మరాజు స్కూల్, తణుకు.



ఉప్పాడ లిఖిత,
4వ తరగతి,
జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల,
రైల్వే న్యూ కాలనీ, విశాఖపట్నం



జీవన the family

JEEVANA

జీవన సారథ్యం

బాధ్యతను గ్రహించినప్పుడే ఆశయాలను పూర్తి చేసుకోవాలనే పట్టుదల వస్తుంది.

బాల్యం నుంచే సమానత్వ బోధన

'అమ్మ వంటింట్లో పనిచేస్తుంది. నాన్న ఆఫీసుకు వెళ్తాడు. అమ్మ ఇంటి పనులు చేస్తుంది. నాన్న బజారుకెళ్లి కూరగాయలు, సరుకులు తెస్తాడు'.. ఇదే, ఏళ్ల తరబడి మన సమాజమూ, చదువులూ పిల్లలకు చూపిస్తున్న దృశ్యం. స్త్రీ పురుషుల మధ్య అంతరాలను కొనసాగించే ఈ ధోరణి మారాలంటే ఓ ఉద్యమమే రావాలి. ప్రణాళికాబద్ధమైన కృషి జరగాలి. ఈ విషయంలో కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఒక మంచి ప్రయత్నం చేస్తోంది. బాల్యం నుంచే పిల్లలకు లింగ సమానత్వ భావనను అలవాటు చేస్తోంది.



వేసవి సెలవులు ముగిసి మళ్లీ బడికి సిద్ధమైన పవిత్ర కృష్ణ, ఈ ఏడాది 3వ తరగతిలోకి అడుగు పెడుతోంది. కొత్త పాఠ్య పుస్తకాలు తీసుకుని ఇంటికి వచ్చాక, ఆ చిన్నారి వాటన్నింటినీ పరిశీలనగా చూసింది. మలయాళ మీడియం టెక్స్ట్ బుక్‌పై ముద్రించిన ఓ చిత్రం తనని ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ ఉత్సాహంతో పరుగున నాన్న దగ్గరికి వెళ్లింది. 'నాన్నా... నాన్నా ... ఈ బొమ్మ చూడు. వంటగదిలో అమ్మతో పాటు నాన్న కూడా పనిచేస్తున్నాడు. అమ్మకు సాయం చేస్తున్నాడు. మరి నువ్వెందుకు నాన్నా, ఎప్పుడూ వంటగదిలోకి రావు? అమ్మ ఒక్కత్తే కష్టపడుతుంది!' అని అడిగింది. పవిత్ర లాంటి చిన్నారుల మెదళ్లలో అలాంటి ఆలోచనలు, ప్రశ్నలూ రేకెత్తేలా కేరళ ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను రూపొందించింది. పవిత్ర తన తండ్రికి చూపించిన బొమ్మలో– వంటగదిలో పనిచేస్తున్న అమ్మ, కత్తిపీటతో కొబ్బరి తురుముతున్న నాన్న, చుట్టూ పిల్లలు ఉంటారు. చాలా చిన్న చిన్న బొమ్మలతోనే పిల్లలకు అర్థమయ్యే భాషలో లింగ సమానత్వం గురించి వివరంగా చెప్పారు.

2021 నుంచీ ...

రాష్ట్రంలో లింగ సమానత్వాన్ని పాటించటానికి, వరకట్న నేరాలకు అడ్డుకట్ట వేయటానికీ కేరళ ప్రభుత్వం 2021లో ఒక బృహత్తర కార్యక్రమం ప్రారంభించింది. మహిళలకు తక్కువ చేసి చూపించే పదాలను పాఠ్య పుస్తకాల నుంచి తొలగిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి అప్పట్లో ప్రకటించారు. ఆవిధంగానే పాఠ్య పుస్తకాల్లో మహిళలను ఉద్దేశించి లిఖించిన అగౌరవ పదాలను తొలగించారు. లింగ సమానత్వాన్ని ప్రబోధించే కథలూ, బొమ్మలూ పాఠ్యపుస్తకాల్లో ఉండేలా చర్యలు చేపట్టింది.

కొన్ని రాష్ట్రాల్లో వివక్షపూరిత రాతలు

కొంత కాలంగా బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్య పుస్తకాల ద్వారా, చిన్నారి మెదళ్లల్లో విషపు బీజాలు నాటుతున్నాయి. లింగవివక్షను పెంచి పోషించే కథనాలు ప్రచురిస్తున్నాయి. 2017లో మహారాష్ట్ర 12వ తరగతి పాఠ్య పుస్తకంలో వరకట్నంపై రాసిన రాతలు అందుకు ఒక ఉదాహరణ. 'అందవికారంగా, అంగవైకల్యంగా ఉన్న అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడం చాలా కష్టం. అటువంటి వారిని పెళ్లి చేసుకోవడానికి వరుడు అధిక కట్నం డిమాండ్ చేస్తార'ని అందులో రాశారు. 2006లో రాజస్థాన్ పాఠ్య పుస్తకాల్లో గృహిణులను గాడిదలతో పోల్చిన కథనాలు వల్లె వేయించారు. 'గాడిద, ఒక గృహిణి లాంటిది. అది రోజంతా కష్టపడుతుంది. తిండి, నీళ్లు లేకుండా పనిచేస్తుంది' అని రాశారు. ఇంకా 'గృహిణి కంటే గాడిద చాలా ఉత్తమమైనది. గృహిణులు ఏదైనా సందర్భాల్లో చాకిరీ నుంచి తప్పించుకునేందుకు పుట్టిళ్లకి వెళతారు. కానీ గాడిదలు అలా కాదు, ఎంత చాకిరీ చేసినా యజమానిని వదిలిపెట్టవు' అని ప్రచురించారు. ఈ కథనంపై తీవ్ర విమర్శలు వచ్చిన తరువాత అదంతా సరదా కోసం చేసిన పోలికని సమర్థించుకున్నారు. నిజానికి ఈ రాతలు, పోలికలు హాస్యాన్ని కలిగించవు. పిల్లల మెదళ్లలో పురాతన భావాలను పెంచి పోషిస్తాయి.

యునెస్కో ఏం చెప్పింది?

యునెస్కో వారి గ్లోబల్ ఎడ్యుకేషనల్ మోనిటరింగ్ రిపోర్ట్ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ముద్రితమవుతున్న పాఠశాల పాఠ్య పుస్తకాల్లో మహిళలు, బాలికలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. పితృస్వామ్య భావాలను, సనాతన అభిప్రాయాలను బలపరిచే కాలం చెల్లిన పాత్రల్లోనే వారు తరచూ కనిపిస్తున్నారు. ఒక సర్వే ప్రకారం 188 భారతీయ టెక్స్ట్ బుక్స్‌ల్లో అధిక భాగం అంటే 114 (60.6) పుస్తకాల్లో పురుష పాత్రలే ప్రధాన భూమికగా ఉన్నాయి. 13 (6.9) మాత్రమే మహిళ పాత్రలకు ప్రాధాన్యత ఇచ్చాయి. ఇంగ్లీషు, హిందీ, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ పాఠ్య పుస్తకాల్లో సగానికి పైగా చిత్రాలు, కథనాలు పురుష పాత్రలతోనే నిండిపోయాయి.

ఉదాహరణకు రాజస్థాన్ 9వ తరగతి, ఇంగ్లీషు రాపిడ్ రీడర్ పాఠ్య పుస్తకంలో 'రిజిగ్నేషన్' (రాజీనామా) అన్న పాఠంలో మగపిల్లలు లేని కథానాయకుని బాధలను ఒక వాక్యంలో ఇలా రాశారు. 'అతని చుట్టూ ఒక నిరాశ, ఓటమి ఉంది. అతనికి కొడుకులు లేరు. ముగ్గురూ కుమార్తెలే. సోదరులు లేరు. మేనకోడళ్లే ఉన్నారు'. ఈ వ్యాఖ్యలు భ్రూణ హత్యలకు ప్రేరేపించేవిగా ఉన్నాయని విమర్శలు వచ్చాయి.

పాఠశాల స్థాయిలోనే పిల్లల మెదళ్లలో విష బీజాలు నాటడం భవిష్యత్తు సమాజాన్ని తిరోగమనం పట్టించడమే. లింగ వివక్ష, స్త్రీద్వేషం, పితృస్వామ్య ఆదర్శాలు వంటి భావనలకు విద్యావ్యవస్థలో శాశ్వత స్థానం కల్పించడం హానికర పరిణామాలకు దారితీస్తాయి. పిల్లల్లో గ్రాహక శక్తి అద్భుతంగా ఉంటుంది. వారి చుట్టూ ఏర్పడిన వాతావరణం, నమ్మకాలు యుక్తవయసులో వారి జీవితంపై ప్రభావాన్ని చూపిస్తాయి. వారి దృక్పథంలో మార్పులు తెస్తాయి. ఇలాంటి వాతావరణంలో కేరళ చేస్తున్న కృషి అభినందనీయం. అనుసరణీయం.



14న 'ఓ మంచి ఘోస్ట్' విడుదల

మార్క్‌సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్‌పై శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో ఈనెల 14న విడుదల కానున్న చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. ప్రముఖ కమెడియన్ వెన్నెల కిషోర్, నందితా శ్వేత, షకలక శంకర్, నవమి గాయక్, నవీన్ నేని, రజత్ రాఘవ్, హాస్యనటుడు రఘుబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. డాక్టర్ అబినికా ఇనాబతుని నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం నిర్మించగా.. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో అందరినీ ఆకట్టుకునేలా ఉంది.

అతిథి పాత్రలో సల్మాన్ ఖాన్



బాలీవుడ్‌లో ప్రముఖ నటీనటులు జాకీష్రాఫ్, సంజయ్‌దత్, బాబీ డియోల్ వంటి స్టార్ నటులు దక్షిణాది సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ కూడా దక్షిణాది తెరపై మెరవబోతున్నారు. దర్శకుడు ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ తన 23వ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్. మలయాళ నటుడు బిజుమీనన్, విద్యుత్ జమ్వాల్ ముఖ్యపాత్రలను పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటోంది. శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది చివరిలో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో సల్మాన్‌ఖాన్ అతిథి పాత్రలో మెరిసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దర్శకుడు ఏఆర్.మురుగదాస్ హిందీలో సల్మాన్‌ఖాన్ హీరోగా సిఖిందర్ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆ పరిచయంతోనే సల్లూభాయ్‌ను తమిళంలో శివకార్తికేయన్‌తో చేస్తున్న చిత్రంలో అతిథి పాత్రలో నటింపజేస్తున్నట్లు టాక్.

జులై 2న వరలక్ష్మి వివాహం



కథానాయికగానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నారు వరలక్ష్మీ శరతకుమార్. టాలీవుడ్‌లో బలమైన పాత్రలతో మెప్పిస్తున్నారు. ఈ మధ్యకాలంతో తెలుగు సినిమాలతో మరింత బిజీ అయ్యారు. ఆమె త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారు. నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయబోతోంది. మార్చిలో వీరి నిశ్చితార్థం జరిగింది. జూలై 2న థాయ్‌ల్యాండ్‌లో పెళ్లి జరగనుంది. పెళ్లి పనులు, పిలుపులు షురూ చేశారు. పెళ్లి పత్రికల పంపిణీలో భాగంగా రజనీకాంత్‌ను కుటుంబ సమేతంగా కలిసి తన పెళ్లికి రమ్మని వరలక్ష్మి ఆహ్వానించారు. 'తలైవా సర్‌ను, లతా ఆంటీని కలిసి పెళ్లికి ఆహ్వానించాను. నాపై ఎంతో ప్రేమ చూపిస్తున్నందుకు థాంక్యూ సర్. ఐశ్వర్య రజనీకాంత్.. ఎప్పటిలాగే నాతో ఎంతో ప్రేమగా మాట్లాడావు' అని వరలక్ష్మీ ఇన్ స్టాగ్రామ్‌లో రాసుకొచ్చింది. ఫొటోలో రజనీకాంత్ దంపతులతో పాటు వరలక్ష్మి తల్లిదండ్రులు రాధిక–శరత్‌కుమార్ ఉన్నారు.



బాలకృష్ణను కలిసిన దర్శకులు

సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను తెలుగు సినిమా పరిశ్రమకు చెందిన పలువురు దర్శకులు శుక్రవారంనాడు కలిసి అభినందనలు తెలిపారు. అనిల్ రావిపూడి, బాబీ, గోపీచంద్ మలినేని బాలకృష్ణను కలిశారు. బాలకృష్ణ అభిమానులు వాటిని షేర్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్ బాలకృష్ణకు, పిఠాపురం ఎమ్మెల్యేగా గెలుపొందిన పవన్‌కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు.

'బెదిరింపు కాల్స్ వస్తున్నాయ్'

'నాకు చాలా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఎవరెన్ని ఇబ్బందులకు గురిచేసినా వెనుకడుగు వేసేది లేదు. నాపై వస్తున్న ట్రోల్స్‌ను పట్టించుకోబోను. ఎవరినీ కూడా నేను వ్యక్తిగతంగా దూషించలేదు. ఎవరి అభిమానం వారిది' అంటూ సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ శ్యామల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీలో కొత్తగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో వైసిపి తరపున ప్రచారం చేసిన సంగతి తెలిసిందే!

14న 'ఐ 20' విడుదల



సూర్యరాజ్, మెరీనా సింగ్ జంటగా నటించిన చిత్రం 'ఐ – 20'. బివేర్ ఆఫ్ గర్ల్స్ (అమ్మాయిలతో జాగ్రత్త) అనేది ఉప శీర్షిక. సూగూరి రవీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆవిష్కార్ మూవీ క్రియేషన్స్ పతాకంపై పి.బి. మహేంద్ర నిర్మించారు. ఈనెల 14న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్ర మాట్లాడుతూ 'మన దేశంలో స్త్రీలను ప్రత్యేకంగా గౌరవిస్తాం. వాళ్ళ గౌరవం గురించే ఈ చిత్రాన్ని నిర్మించాం. కథ చాలా బాగా వచ్చింది' అన్నారు.

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

ఫైనల్‌కు అల్కరాజ్

- ఐదుసెట్ల హోరాహోరీ సెమీస్‌లో సిన్నర్‌పై గెలుపు
- నేడు స్వైటెక్, పోలిని మధ్య మహిళల సింగిల్స్ టైటిల్ పోరు



పారిస్: స్పెయిన్ యువ సంచలనం, 3వ సీడ్ కార్లోస్ అల్కరాజ్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. రొలాండ్ గారోస్‌లో హోరాహోరీగా సాగిన ఐదుసెట్ల తొలి సెమీస్‌లో అల్కరాజ్ 2వ సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్‌ను చిత్తుచేశాడు. గత ఏడాది ఈ టోర్నమెంట్ సెమీస్‌కు చేరినా.. నొవాక్ జకోవిచ్ చేతిలో ఓడి ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు. 2023లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన అల్కరాజ్‌కు ఆ ఏడాది నిరాశ ఎదురైనా.. ఈసారి 3వ సీడ్‌గా బరిలోకి దిగి ఏకంగా 2వ సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్‌ను ఓడించి ఫైనల్‌కు చేరడం విశేషం. శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన తొలి సెమీస్‌లో అల్కరాజ్ 2–6, 6–3, 3–6, 6–4, 6–3తో 2వ సీడ్ జెన్నిక్ సిన్నర్‌పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లు ఇరువురు ఏడు చొప్పున ఏస్‌లను సంధించగా.. తొలి సర్వ్‌ను 64శాతం విజయవంతంగా ముగించి మ్యాచ్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. అనవసర తప్పిదాలు ఎక్కువ చేసిన సిన్నర్ ఓటమిపాలై ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు. ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న 21ఏళ్ల అల్కరాజ్ గత ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకొన్నాడు. అలాగే 2022లో తొలిసారి యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకొని కెరీర్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వేటను మొదలు పెట్టాడు. సెమీస్‌లో గెలుపుతో అల్కరాజ్ 2024 ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. 2వ సీడ్‌గా ఫ్రెంచ్ ఓపెన్ బరిలోకి దిగిన సిన్నర్.. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను చేజిక్కించుకొని అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను నెగ్గి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సిన్నర్ తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే ఏటిపి ర్యాంకింగ్స్‌లోనూ నొవాక్ జకోవిచ్ తర్వాత 2వ స్థానంతో ఫ్రెంచ్ ఓపెన్ బరిలోకి దిగిన సిన్నర్ జోరుకు అల్కరాజ్ కళ్లెం వేశాడు. ప్రి క్వార్టర్స్‌లో నొవాక్ జకోవిచ్ గాయం కారణంగా టోర్నీనుంచి అర్ధాంతరంగా వైదొలగడంతో అల్కరాజ్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు మార్గం సుగమమైంది. అల్కరాజ్ ఫైనల్‌కు చేరే క్రమంలో క్వార్టర్స్‌లో 9వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్), ప్రి క్వార్టర్స్‌లో 21వ సీడ్ అగర్ అలియమే(కెనడా), 3వ రౌండ్‌లో 27వ సీడ్ కొర్డా(అమెరికా)లను చిత్తుచేశాడు. 7వ సీడ్ రూడ్(డెన్మార్క్), 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ)ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో అల్కరాజ్ ఫైనల్లో తలపడనున్నాడు.

నేడు టాప్‌సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వైటెక్, ఇటలీకి చెందిన 12వ సీడ్ పోలిని మధ్య మహిళల సింగిల్స్ టైటిల్ పోరు జరగనుంది.

స్కాట్లాండ్ విజయం

నమీబియాపై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

బార్బొడాస్: ఐసిసి టి20 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇంగ్లండ్‌తో జరగాల్సిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా.. రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు నమీబియాపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గ్రూప్–బిలో భాగంగా బ్రిడ్జ్‌టౌన్‌లో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 155పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని స్కాట్లాండ్ జట్టు 18.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నమీబియా ఓపెనర్ కోర్జే(0) నిరాశపరిచినా.. డావిన్(20)కి తోడు కెప్టెన్ ఎరాస్మస్(52) అర్ధసెంచరీతో రాణించాడు. ఆ తర్వాత వికెట్ కీపర్ గ్రీన్(28) కూడా రాణించడంతో నమీబియా జట్టు గౌరవప్రద స్కోర్‌ను నమోదు చేసింది. స్కాట్లాండ్ బౌలర్లు వీల్‌కు మూడు, క్యారీకి రెండు, సోలే, గ్రీవ్స్, లీస్క్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం స్కాట్లాండ్ ఓపెనర్ మూన్సే(7) నిరాశపరిచినా.. జోన్స్(26), ముల్లెన్(19)కి తోడు కెప్టెన్ బెర్రింగ్టన్(47నాటౌట్), లీస్క్(35) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో స్కాట్లాండ్ జట్టు మరో 9బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది. నమీబియా బౌలర్లు ఎరాస్మస్‌కు రెండు, స్కోల్జ్, లంగ్మెని, ట్రంపెల్మన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లీస్క్‌కు లభించింది.

అమెరికా కిర్రాక్.. పాక్‌పై 'సూపర్' విజయం

టి20 ప్రపంచకప్‌లో అమెరికా పెను సంచలనాన్ని నమోదు చేసింది. గురువారం రాత్రి డెల్లాస్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అమెరికా సూపర్ ఓవర్లో పాక్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 159పరుగులు చేయగా.. ఛేదనలో అమెరికా కూడా 20ఓవర్లు పూర్తయ్యేసరికి 3వికెట్లు కోల్పోయి 159పరుగులే చేసింది. అనంతరం సూపర్ ఓవర్లో అమెరికా 18పరుగులు చేయగా.. పాకిస్తాన్ జట్టు 13పరుగులే చేసింది. అమెరికా బౌలర్ నేత్రావల్కర్‌ల సూపర్ బౌలింగ్‌తో పాక్‌ను కట్టడి చేసి అమెరికా గెలుపులో కీలకపాత్ర పోషించాడు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ × ఆఫ్ఘనిస్తాన్
వేదిక: గయానా; ఉ.5.00గం॥లకు

శ్రీలంక × బంగ్లాదేశ్
వేదిక: డల్లాస్; ఉ.6.00గం॥లకు

నెదర్లాండ్స్ × దక్షిణాఫ్రికా
వేదిక: న్యూయార్క్; రా.9.00గం॥లకు

ఆస్ట్రేలియా × ఇంగ్లండ్
వేదిక: బార్బొడాస్; రా.10.30గం॥లకు

క్వార్టర్స్‌లో ఓడిన లక్ష్యసేన్



జకార్తా: ఇండోనేషియా ఓపెన్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌కు చేరిన ఏకైక షట్లర్ లక్ష్యసేన్ శుక్రవారం పరాజయాన్ని చవిచూశాడు. హోరాహోరీ సాగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ డెన్మార్క్ ఆటగాడు అండర్స్ ఆంటోన్సెన్ చేతిలో ఓడాడు. ఈ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 22–24, 18–21తో మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఈ గెలుపుతో లక్ష్యసేన్‌పై ఆంటోన్సెన్ తన రికార్డును 3–2కు మెరుగుపర్చుకున్నాడు. తొలి సెట్‌లో లక్ష్యసేన్, అండర్స్‌లు పోటాపోటీగా ఆడారు. ఒకదశలో డెన్మార్క్ ఆటగాడు 4–0తో ఆధిక్యంలోకి వెళ్లినా.. ఆ తర్వాత లక్ష్యసేన్ తన రాకెట్ పవర్ చూపిస్తూ 5–5తో స్కోర్ సమం చేశాడు. అంతేకాదు 15–11తో ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. కానీ, ఒత్తిడిని తట్టుకోలేక రెండు పాయింట్లతో తొలి సెట్ కోల్పోయాడు. ఇక రెండో గేమ్‌లో ఇద్దరూ నువ్వా–నేనా అన్నట్టు తలపడినా చివరకు ఆంటోన్సెన్ వరుసగా మూడు పాయింట్లతో లక్ష్యసేన్ చిత్తుచేశాడు. సెమీస్‌లో ఆంటోన్సెన్ 8వ సీడ్ వితిద్‌సర్న్‌తో తలపడనున్నాడు.



గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) దాడిలో ధ్వంసమైన వర్మ కారు

మాజీ ఎంఎల్ఎ వర్మపై జనసైనికుల దాడి

ప్రజాశక్తి- పిఠాపురం (కాకినాడ జిల్లా)
కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో టిడిపి మాజీ ఎంఎల్ఎ వర్మపై జనసైనికులు దాడి చేశారు. గ్రామస్తులు, టిడిపి నాయకులు తెలిపిన వివరాలు ప్రకారం... వన్నెపూడి వైసిపి సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యం ఇంటికి మాజీ ఎంఎల్ఎ వర్మ శుక్రవారం వెళ్లారు. తిరిగి వయసమవుతున్న సమయంలో జనసైనికులు మూకుమ్మడిగా ఇటుకలు, సీసాలు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురు టిడిపి కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. వర్మ కారు అద్దాలు పగిలాయి. టిడిపి కార్యకర్తలు వలయంగా ఏర్పడి వర్మను అక్కడి నుంచి తప్పించారు. అనంతరం గొల్లప్రోలులోని తన గెస్ట్ హౌస్ వద్ద చేరుకున్నారు. దాడి విషయం తెలుసుకున్న పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు, వర్మ అభిమానులు అక్కడికి భారీగా చేరుకున్నారు.

ఈ సందర్భంగా మీడియాతో వర్మ మాట్లాడుతూ ఎన్నికల పూర్తి అయిన అనంతరం ఎన్నికల్లో పాల్గొన్న కార్యకర్తలను, సహకరించిన వారిని కలవడం తన బాధ్యతన్నారు. అందులో భాగంగా ఎన్నికల్లో సహకరించిన సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యంను కలిశానన్నారు. ఇది సహించని ఐటీడిపి టిడిపి నుంచి జనసేనలో కలిసిన నాయకులు, కార్యకర్తలు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. టిడిపి నాయకులు, కార్యకర్తల సహకారంతో తప్పించుకున్నానని తెలిపారు. దాడికి నిరసనగా టిడిపి నాయకులు గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు.

శామ్‌సంగ్ ఉద్యోగులు తొలి ఉద్యమబాట

సియోల్ : దక్షిణ కొరియాలోని శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. వేతన పెంపు కోరుతూ నిరసనలు చేపట్టారు. అనేక మంది ఉద్యోగులు మూకుమ్మడి సెలవులు పెట్టి తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. దాదాపు 10 మంది కార్మికులు ప్రాతినిధ్యం వహిస్తున్న నేషనల్ శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ (ఎన్ఎస్ఇయు) ఆధ్వర్యంలో సియోల్‌లోని శామ్‌సంగ్ ప్రధాన కార్యాలయం వద్ద కూడా పలువురు ఉద్యోగులు నిరసన తెలిపారు. 'శ్రమను గౌరవించండి!, మేమే గౌరవమైన కార్మికుల కోరిందం లేదు. న్యాయబద్ధమైన వేతనాలు ఇవ్వండి చాలు' అంటూ నినాదాలు చేశారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు మూకుమ్మడి సెలవులు తీసుకున్నారని, ఆందోళన క్రమంగా విస్తరిస్తోందని ఎన్ఎస్ఇయు అధ్యక్షులు సోన్ వూమెక్ మీడియాకు తెలిపారు. వేతనాల పెంపుపై జనవరి నుంచి కార్మిక యూనియన్, యాజమాన్యం మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే 5.1 శాతం వేతన పెంపును అమలు చేశామని, కానీ యూనియన్ ఆదనపు రోజు వార్షిక సెలవు, పనితీరు ఆధారిత బోనస్‌లు కోరుతున్నాయని యాజమాన్యం వాదిస్తోంది. అయితే కార్మికుల సమ్మె కారణంగా ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం లేదని యాజమాన్యం చెబుతుంది. అయితే శామ్‌సంగ్‌లో కార్మికుల సమ్మె చాలా అరుదైన విషయమని విశ్లేషకులు చెబుతున్నారు. శామ్‌సంగ్‌లో సుమారు 50 ఏళ్ల పాటు కార్మికుల యూనియన్లను నిషేధించారు. అయితే 2010లో అప్పటి దేశ అధ్యక్షులు మూన్ జే-ఇన్ ఛొరవ కారణంగా యూనియన్లు ఏర్పాటయ్యాయి. ఎన్ఎస్ఇయులో 28 వేల ఉద్యోగులు ఉన్నారు. ఇది మొత్తం శామ్‌సంగ్ శ్రామిక శక్తిలో ఐదో వంతుతో సమానం. అలాగే సంస్థలో ఉన్న ఐదు యూనియన్లలో ఇదే అతి పెద్దది. సమ్మె గురించి యూనియన్ల నాయకులు మాట్లాడుతూ సమ్మెతో ఉత్పత్తికి అంతరాయం కలిగించమని, అది మా ఉద్దేశ్యం కాదని చెప్పారు.

యుఎన్‌జిఎ అధ్యక్షులుగా కామెరూన్ మాజీ ప్రధాని



ఐక్యరాజ్య సమితి : కామెరూన్ మాజీ ప్రధాని ఫిలెమోన్ యాంగ్ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ) 79వ సమావేశాలకు అధ్యక్షుడిగా గురువారం ఎన్నుకున్నారు. ఇప్పటివరకు 78వ యుఎన్‌జిఎ సెషన్‌కు నేతృత్వం వహించిన ట్రినిడాడ్ అండ్ టుబాగో అధ్యక్షులు డెనిస్ ఫ్రాన్సిస్ స్థానంలో యాంగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో సెప్టెంబరు 10న ఈ సమావేశాలు ప్రారంభమవుతాయి. "మన విభేదాలు, మన వైవిధ్యతను దాటి మనందరం శాంతిని పెంపొందించేందుకు కలిసికట్టుగా వ్యవహరించాలి. ఎక్కడా ఎలాంటి యుద్ధం జరగకుండా చూడాలి. ఐక్యరాజ్య స్ఫూర్తితో విపత్తులను నివారించాలి." అని ఎన్నికైన సందర్భంగా యాంగ్ పేర్కొన్నారు. బహుముఖ వాదాన్ని బలోపేతం చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితి నిబంధనావళి, సిద్ధాంతాలు, నిబంధనలకు ఇదే పునాదని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో తన పదవీకాలంలో వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు.

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

బెంగుళూరు : బిజెపి దాఖలు చేసిన పరువునష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఇక్కడి ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివిధ వార్తాపత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లో బిజెపిని అవినీతి పార్టీగా పేర్కొన్నందుకు ఈ కేసు నమోదయింది. ఈ నెల 1న జరిగిన ఈ కేసు తొలి విచారణలో శుక్రవారం రాహుల్‌గాంధీ వ్యక్తిగతంగా హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. దీంతో శుక్రవారం రాహుల్ విచారణకు హాజరయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68